ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
తూర్పుగోదావరి
జిల్లా వార్తలు
ఆదివారం 21 జూలై 2024 | 5

ఊళ్లు..కన్నీళ్లు!


ఊళ్లోకొచ్చిన వరద : నిడదవోలు మండలం తాళ్ళపాలెంలో రోడ్డుపై వరద


అప్రమత్తం : నిడదవోలు మండలం శింగవరంలో పునరావాస కేంద్రం వద్ద కలెక్టర్ ప్రశాంతి సూచనలు


రోడ్డెక్కిన వరద : కోరుకొండ మండలం శ్రీరంగపట్నంలో రోడ్డుపై పారుతున్న వరద

జోరు తగ్గిన వాన.. వీడని ముంపు

- నాలుగు రోజుల పాటు వాన
- శనివారం కాస్త తగ్గుముఖం
- నీట మునిగిన ఊళ్లు.. చేలు
- 217 గ్రామాల్లో ముంపు
- రైతన్నకు మిగిలింది కన్నీరు
- ఉప్పొంగుతున్న గోదావరి
- నీట మునిగిన రేవులు

రాజమహేంద్రవరం, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : ఊళ్లు.. నీళ్లు.. కన్నీళ్లు.. గత నాలుగు రోజులుగా ఎడతెరిపి లేకుండా చినుకులు పడుతూనే ఉన్నాయి.. దీంతో ఊళ్లు.. చేలు నీటిలో ముంపులోనే ఉన్నాయి.. ఇటు ప్రజలు.. అటు రైతులు కన్నీళ్లు పెడుతూనే ఉన్నారు.చినుకు చూసి వణికిపోతున్నారు. వరుణదేవా కరుణించవా అంటూ వేడుకుంటున్నారు..ఎక్కడి కక్కడ జనజీవనం స్తంభించడంతో ఇబ్బందులు పడుతున్నారు. వాన జోరు శనివారం కాస్త తగ్గినా తగ్గినా జిల్లాలో చేలన్నీ ముంపులోనే ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా చాలా గ్రామాలు నీటి ముంపులోనే ఉన్నాయి.అనేక గ్రామాల్లో రోడ్లపై నుంచి నీరింకా ప్రవహిస్తూ ఉంది. వాన తగ్గుముఖం పట్టిందంటే గోదావరి వరద పెరుగుతుండడంతో రైతాంగం వణికిపోతున్నారు. కోరుకొండ మండలం శ్రీరంగపట్నంలో జల్లకాలువ పొంగడంతో రోడ్లపై నీరు ప్రవహిస్తుంది. ఎర్రకాల్వ పొంగడంతో నిడదవోలు మండలం తాళ్లపాలెం నీట మునిగింది. కొవ్వాడ కాలువ పొంగడంతో తాళ్ళపూడి మండలంలో వేలాది ఎకరాలు నీట మునిగాయి. కొవ్వాడ కాల్వలో రాకపోకలు బంద్ చేశారు.జిల్లా వ్యాప్తంగా 14,329 హెక్టార్లలో వరి నాట్లు నీట మునిగాయి. 18 మండలాల పరిధిలోని 217 గ్రామాల్లో 16,845 మంది రైతులు ఆందోళన చెందుతున్నారు.

14,329 హెక్టార్లలో వర్రీయే

జిల్లాలో పంటలకు భారీ నష్టం జరిగింది. వరిచేలు నీటి ముంపులోనే ఉన్నాయి.ఉద్యాన పంటలదీ అదే పరిస్థితి. ఎర్రకాలువ, కొవ్వాడ కాలువ, బురద కాలువ,జల్లకాలువలు పొంగడంతో 14,329 హెక్టార్లలో వరినాట్లు ముంపులో ఉన్నా యి. దీంతో 18 మండలాల పరిధిలోని 217 గ్రామాలకు చెందిన 16,845 మంది రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎర్రకాలువ వల్ల నల్లజర్ల, నిడదవోలు మండలాల్లో సుమారు 10 వేల హెక్టార్లలో నష్టం వాటిల్లింది.ఈ మేరకు ఆయా మండలాల్లో కలెక్టర్ పి.ప్రశాంతి విస్తృతంగా పర్యటించారు. కంసాలిపాలెంలో పునరావాస కేంద్రం ఏర్పాటు చేశారు. వరద నీటిలో పాములు కొట్టుకురావడంతో కలెక్టర్ ఆదేశాల మేరకు అటవీ శాఖ అధికారులకు కంసాలిపాలెంలో పాములు పట్టిం చారు. కొవ్వాడ కాలువ వల్ల తాళ్లపూడి మండలంలో నష్టం జరిగింది. ఉద్యాన పంటలకు సంబంధించి 40 గ్రామాల్లో 431 మంది రైతులకు చెందిన 276.28 హెక్టార్ల పంట నీట మునిగిపోయింది.బురద కాలువ వల్ల గోకవరం, కోరుకొండ, సీతానగరం మండలాల్లో, జెల్ల కాలువ వల్ల రాజమహేం ద్రవరం రూరల్ మండలం బూరు గుపూడి,కొంతమూరు, కాతేరు పరిసర ప్రాంతాల్లో ఆవ భూములు సముద్రాన్ని తలపిస్తున్నాయి.


దారులన్నీ ఇంతే : ఛిద్రమైన బూరుగుపూడి రహదారి

విద్యుత్ శాఖకు తీవ్ర నష్టం..

భారీ వర్షాల వల్ల విద్యుత్ శాఖకు భారీ నష్టం వాటిల్లింది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 60 విద్యుత్ స్తంభాలు, 79 ఎల్‌టీ పోల్స్, 14 డిస్ట్రిబ్యూషన్ ట్రాన్సఫా ర్మర్లు దెబ్బతినడంతో రూ.36.48 లక్షలు నష్టం జరిగింది. నిడదవోలు డివిజన్‌లో 11 కేవీ పోల్స్ 19, ఎల్‌టీ పోల్స్ 5 దెబ్బతినడంతో రూ.4.26 లక్షల నష్టం జరిగింది. 138 వ్యవసాయ కనెక్షన్లకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.46 పునరుద్ధరించారు. నిడదవోలు డివి జన్‌లో 126 సర్వీసులకు విద్యుత్ నిలిచిపోయింది.


ముంచేసిన వరద : నిడదవోలు మండలం తాళ్ళపాలెంలో నీట మునిగిన పంచాయతీ కార్యాలయం, పాఠశాల భవనం

శాంతించిన వరుణదేవుడు..

రాజమహేంద్రవరం సిటీ, జూలై 20 : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి ప్రభావంతో గత మూడు రోజులుగా ఒక మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిశాయి. గత రెండు రోజులతో పోల్చితే శనివారం వర్షం తీవ్రత బాగా తగ్గింది. ఉదయం 8.30 నుంచి సాయంత్రం 4 గంటలోపు జిల్లాలో 109.6 మీమీ వర్షపాతం నమోదైంది. జిల్లాలో సీతానగరంలో 8.4 మి.మీ, రాజమహేంద్రవరంలో 8.2 మి.మీ, రాజమహేంద్రవరం రూరల్‌లో 7.4 మి.మీ, నిడదవోలులో 7.4 మి.మీ, పెరవలిలో 6.4 మి.మీ,తాళ్ళపూడిలో 6.0 మి.మీ, కడియంలో 6.0 మి.మీ, రాజానగరంలో 6.0 మి.మీ, గోకవరంలో 5.8 మి.మీ, చాగల్లులో 5.6 మి.మీ, కోరుకొండలో 5.4 మి.మీ, ఉండ్రాజవరంలో 5.4 మి.మీ, అనపర్తిలో 5.2 మి.మీ, నల్లజర్లలో 5.0 మి.మీ, రంగంపేటలో 5.0 మి.మీ, కొవ్వూరులో 4.6 మి.మీ, దేవరపల్లిలో 4.6 మి.మీ, గోపాలపురంలో 4.0 మి.మీ, బిక్కవోలులో 3.2 మి.మీ వర్షపాతం నమోదైంది. జిల్లా వ్యాప్తంగా సగటున 5.9 శాతం వర్షం మాత్రమే కురిసింది.

రైతులు ఆందోళన చెందవద్దు : శాస్త్రవేత్తలు



తాళ్ళపూడి, జూలై 20 : వర్షం నీటిలో ఉన్న పొలాల్లో మాత్రం వరినాట్లను కాపాడుకునే అవకాశం ఉందని ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు తెలిపారు. కొవ్వాడ కాలువ పరీవాహక ప్రాంతాలైన తాళ్ళపూడి మండలంలోని అన్నదేవరపేట, పెద్దేవం, మలకలపల్లి, తిరుగుడుమెట్ట గ్రామాల్లో ముంపు ప్రాంతాలను ఏరువాక కేంద్రం కో ఆర్డినేటర్ చల్లా శంకరరావు, మార్టేరు శాస్త్రవేత్త శ్రీనివాసరావు, జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు, ఏడీఏ చంద్రశేఖర్ పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. ఆందోళన చెందవద్దని సూచించారు.


వంతెనా పోయే.. రోడ్డూ పాయే : బొబ్బిల్లంక మిర్తిపాడు రహదారిలో కొట్టుకుపోయిన రోడ్డు.. వరద ప్రవాహం

వైసీపీ పాలకుల నిర్లక్ష్యం.. ముంచెత్తిన వరద

సీతానగరం,జూలై 20 : వైసీపీ నాయకుల నిర్లక్ష్యం కారణంగా వర్షాలకు రోడ్డు కొట్టుకుపోయింది. బొబ్బిల్లంక మిర్తిపాడు రహదారిలో తెలుగుదేశం హయాంలో వంతెన నిర్మించారు. అయితే వైసీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత తూరలు చిన్నవి పెట్టి వంతెన కట్టడం వల్ల పంట భూములు మునిగిపోతున్నాయన్న నెపంతో వంతెన కూలగొట్టి తాత్కాలిక రోడ్డు వేశారు. 2023లో వంతెన సరిచేయడానికి రూ.4.5 కోట్లు మంజూరు చేసినప్పటికి కాంట్రాక్టర్లు ముందుకు రాలేదు. ప్రస్తుతం వర్షాలకు నేల బారున ఉన్న తాత్కాలిక రోడ్డు మాత్రం వరదలకు కొట్టుకుపోయింది. దీంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. బొబ్బిల్లంక వైపు నుంచి మధురపూడి విమానాశ్రయానికి వెళ్లడానికి ఇదే మార్గం. ఇది గాక చుట్టుపక్కల పొలాలకు ఇదే దారి. ప్రస్తుతం రోడ్డు మునిగిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. కూటమి నాయకులు స్పందించి మళ్లీ వంతెన నిర్మాణం చేపట్టాలని రైతులు, ప్రజలు కోరుతున్నారు.

ఉప్పొంగుతున్న గోదారి

కొవ్వూరు, జూలై 20 : ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలతో అఖండ గోదావరి ఉప్పొం గుతుంది. నదీ పరీవాహక ప్రాంతాలలో కురుస్తున్న వర్షాలకు ఉపనదులు, కొండ వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి.పోలవరం ఎగువ కాఫర్‌డ్యామ్ వద్ద వరద పోటెత్తడంతో స్పిల్‌వే నుంచి సుమారు 4 లక్షల క్యూసెక్కుల వరద నీరు రాజమహేంద్ర వరం అఖండ గోదావరిలోకి వచ్చి చేరుతోంది. ధవళేశ్వరం బ్యారేజి వద్ద 175 గేట్లను ఎత్తివేసి శనివారం సాయంత్రం ఆరు గంటలకు 4,09,459 క్యూసె క్కుల వరద నీరు సముద్రంలోకి విడుదల చేశారు. బ్యారేజి వద్ద నీటిమట్టం 8.70 అడుగులకు చేరింది.భద్రాచలం వద్ద 35.20 అడుగులుగా ఉంది.ధవళేశ్వరం వద్ద సోమవారం నాటికి మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేసే అవకాశం ఉన్నట్టు అధికారుల అంచనా.కొవ్వూరులో గోష్పాదక్షేత్రంలో ప్రధాన స్నానఘట్టాలను ముంచెత్తుతూ అఖండ గోదావరి ఉప్పొంగి ప్రవహిస్తుంది. స్నానఘట్టాల్లో ఉన్న శివలింగం, నందీశ్వరుడు, కాశీ విశ్వేశ్వరుడు విగ్రహాలను వరద ముంచెత్తింది. గత వైసీపీ ప్రభుత్వంలో పోలవరం నుంచి సిద్ధాంతం వరకు గోదావరి ఏటిగట్లను కొల్లగొట్టి ఇసుక ర్యాంపులు ఏర్పా టు చేయడంతో తీరప్రాంత ప్రజలు ఏ సమయంలో ఏ ప్ర మాదం ముంచుకొస్తుందోనని భయాందోళన చెందుతున్నారు.


అఖండ గోదారి : కొవ్వూరు గోష్పాదక్షేత్రంలో ఉధృతి..

నష్టపోయిన రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ

మంత్రి కందుల దుర్గేష్



పెరవలి, జూలై 20 : నష్టపోయిన రైతులందరికి ఇన్‌పుట్ సబ్సిడీ రూ.6 వేలు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని మంత్రి కందుల దుర్గేష్ ఆదేశించారు.పెరవలిలో శనివారం ఆయన మాట్లాడారు. అధికారులు పంట నష్టాన్ని అంచనా వేసే సమయంలో నిబంధనలు సడలించి రైతులకు న్యాయం జరిగేలా చూడాలన్నారు. వరిపంట వేసిన నెల రోజుల్లోపు పంట పాడైతే కేవలం విత్తనం సబ్సిడీ వెయ్యి రూపాయలు మాత్రమే వస్తుందని, కానీ రైతులు ఇప్పటికే వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టి ఉన్నారన్నారు. భారీ వర్షాలతో వరి, ఉద్యా న పంటలు కూడ దెబ్బతిన్నాయన్నారు.

పారిశుధ్యంపై దృష్టి పెట్టండి : కలెక్టర్

నిడదవోలు, జూలై 20 : పునరావాస కేంద్రాల్లో ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలని..ముంపు ప్రాంతాల్లో శానిటేషన్‌పై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. నిడదవోలు మండలంలో వరద ముంపు ప్రాంతాలైన రావిమెట్ల, శింగవరం,తీరుగూడెం తదితర ప్రాంతాల్లో శనివారం పర్య టించారు.పునరావాస కేంద్రాల్లో బస ఏర్పాట్లు, శానిటేషన్, వైద్య శిబిరం అందుబాటులో ఉండాలన్నారు.ఆదేశాలు ఇచ్చే వరకు మత్స్యకారులు చేపల వేటకు వెళ్లవద్దన్నారు.ప్రభుత్వాసుపత్రుల్లో స్నేక్‌బైట్, యాంటి వైరల్ మందులు,ఇంజక్షన్లు అందుబాటులో ఉంచుకోవాలన్నారు.బసివిరెడ్డిపేటలోని ఆటోమెటిక్ వాతావరణ కేంద్ర పరికరాన్ని పరిశీలించారు.ఆమె వెంట సబ్ కలెక్టర్ అశుతోష్‌శ్రీవాత్సవ,డీఎంహెచ్‌వో వెంకటేశ్వరరావు,డీసీహెచ్‌ఎస్ పద్మశ్రీ,ఎంపీడీవో ఝాన్సీ, తహశీల్దార్ వి.నాగభూషణం ఉన్నారు.


నాడు.. నేడూ ఇంతేనా : శ్రీరంగపట్నంలో నీట మునిగిన పాఠశాల ఆవరణ

సెలవు రోజునా..టీచర్లు బడికి..

కోరుకొండ, జూలై 20 : జిల్లాలో భారీ వర్షాలకు శనివారం జిల్లాలో పాఠశాలలకు కలెక్టర్ ఆదే శాల మేరకు సెలవు ప్రకటించారు.అయితే పాఠశాలలకు సెలవు ఇచ్చినప్పటికీ ఉపాధ్యాయులు యధావిధిగా పాఠశాలలకు సకాలంలో వెళ్లాలని శనివారం ఉదయం హెచ్‌ఎంలకు మెసేజ్ రావడంతో ఉరుకులు పరుగులు తీశారు. పాఠశాలలకు విద్యార్థులు రాకపోయినా ఉపాధ్యాయులు ఉదయం నుంచి సాయంత్రం వరకు పాఠశాలలోనే గడిపారు. గతంలో ఎప్పుడు ప్రభుత్వం సెలవు ప్రకటించినా పాఠశాలలకు కేవ లం ఉపాధ్యాయులు మాత్రమే హాజరైన సందర్భాలు లేవు.

ఆర్టీసీ ఆదాయానికి గండి

రాజమహేంద్రవరం అర్బన్, జూలై 20 : ఎడతెరిపిలేని వర్షాలు ఆర్టీసీ ఆదాయానికి భారీగానే గండి కొడుతున్నాయి. గత నాలుగు రోజులుగా వర్షాలు వదలకపోవడంతో జిల్లావ్యాప్తంగా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించేవారి సంఖ్య గణనీయంగా పడిపోయింది. ఈ ప్రభావం ఆర్టీసీ రోజువారీ ఆదాయంపై పడుతోంది. సాధారణ రోజుల్లో సగటున జిల్లా ఆర్టీసీకి నాలుగు డిపోల నుంచి (రాజమహేంద్రవరం, గోకవరం, కొవ్వూరు, నిడదవోలు) రోజుకు రూ.34 లక్షల నుంచి రూ.36 లక్షల వరకూ ఆదాయం వచ్చేది. వర్షాలు వదలకపోవడంతో ఆదాయం రోజుకు రూ.28 లక్షల నుంచి రూ.30 లక్షలకు పడిపోయిందని ఆర్టీసీ వర్గాలు చెబుతున్నాయి. జిల్లాలోని నాలుగు డిపోల నుంచి అన్ని బస్సు సర్వీసులు యథావిధిగా నడుస్తున్నాయని, భద్రాచలం రూటుతో సహా ఏ ఒక్క సర్వీసు రద్దు కాలేదని ఆర్టీసీ అధికారులు వెల్లడించారు.

గోదావరిలో యువకుడు గల్లంతు



కొవ్వూరు, జూలై 20 : నాలుగు రోజుల్లో ఉన్నత చదువుల నిమిత్తం ఆస్ట్రేలియాకు వెళ్లవలసిన ఆ యువకుడు గోదావరిలో గల్లంతయ్యాడు. పోలీసులు అందించిన వివరాల ప్రకారం. నల్లజర్ల మండలం ఆవపాడు గ్రామానికి చెందిన పసుపులేటి శ్రీను, తాయారు దంపతులకు ఇద్దరు కుమారులు.పెద్దకుమారుడు వంశీకృష్ణ(25) ఎంబీఏ పూర్తిచేశాడు.వారం రోజుల్లో ఉన్నత చదువుల నిమిత్తం ఆస్ట్రేలియా పంపడానికి అన్ని ఏర్పాట్లు చేశారు. రాజమహేంద్రవరంలో స్నేహితులను కలిసి వస్తానని చెప్పి బైక్‌పై ఈ నెల 19వ తేదీన శుక్రవారం ఇంటి నుంచి బయటకు వచ్చాడు.ఇంటికి తిరిగి వెళ్లకపోవడంతో కుటుంబ సభ్యులు కంగారు పడుతున్నారు. కొవ్వూరు ఏరినమ్మఘాట్ ఇసుకర్యాంపులో శనివారం ఉదయం కాలకృత్యాలు తీర్చుకోవడానికి వెళ్లి ప్రమాదవశాత్తు కాలుజారి నదిలో ము నిగి గల్లంతయ్యాడు. స్థానికులు గమనించి బైక్‌లో ఉన్న సెల్‌ఫోన్ ఆధారంగా ఇంటికి సమాచారం అందించారు. కుటుంబీకులు సంఘటనా స్థలానికి చేరుకుని గోదావరిలో వంశీకృష్ణ కోసం పడవలపై గాలింపు చర్యలు చేపట్టినా గోదావరి ఉధృతంగా ఉండడంతో ఫలితం లేకపోయింది. మృతుడి సోదరుడు పసలపూడి మురళీకృష్ణ ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసినట్లు కొవ్వూరు పట్టణ హెడ్ కానిస్టేబుల్ రాజమహేంద్రవరపు సత్యనారాయణ తెలిపారు.

జాయింట్ కలెక్టర్‌గా హిమాన్షు కౌశిక్

కడప మునిసిపల్ కమిషనర్‌గా తేజ్‌భరత్



రాజమహేంద్రవరం సిటీ, జూలై 20 : తూర్పుగోదావరి జిల్లా జాయింట్ కలెక్టర్‌గా హిమాన్ష్ కౌశిక్ నియమితులయ్యారు.ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం జీవో నెం 1288 ద్వారా శనివారం ఉత్తర్వులు విడుదల చేసింది. 2018 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన హిమాన్ష్ కౌసిక్ ఢిల్లీ ఆంధ్రాభవన్ అడిషనల్ రెసిడెంట్ కమిషనర్‌గా పనిచేస్తున్నారు. ఆయన్ను తూర్పుగోదావరి జిల్లా జాయింట్ కలెక్టర్‌గా బదిలీ చేశారు. ఇప్పటి వరకు తూర్పుగోదావరి జిల్లా జాయింట్ కలెక్టర్‌గా పనిచేసిన ఎస్.తేజ్ భరత్‌ను కడప నగరపాలక సంస్థ కమిషనర్‌గా నియమిస్తూ ఉత్తర్వులు విడులయ్యాయి.

రాజమహేంద్రవరం కమిషనర్‌గా కేతన్ గర్గే

గుంటూరుకు దినేష్‌కుమార్ బదిలీ



రాజమహేంద్రవరం సిటీ, జూలై 20 : రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ కమిషనర్‌గా కేతన్ గర్గే నియమితులయ్యారు. రాష్ట్ర వ్యాప్తంగా జేసీ లు, కమిషనర్లను బదిలీలు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది.ఇప్పటివరకు కేతన్ గర్గే అనంతపురం జిల్లా జాయింట్ కలెక్టర్‌గా పనిచేశారు.ప్రస్తుతం రాజమహేంద్రవరం కమిషనర్‌గా నియమితులయ్యారు. ఇప్పటి వరకూ రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ కమిషనర్‌గా ఉన్న దినేష్ కుమార్ గుంటూరుకు బదిలీ అయ్యారు. 2017 బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ అధికారి దినేష్ కుమార్ రాజమహేంద్రవరం కమిషనర్‌గా 2022 ఏప్రిల్ 8న బాధ్యతలు స్వీకరించారు. 15 నెలల పాటు పనిచేశారు.

పంచాయతీ కార్యదర్శులకు పదోన్నతులు

కార్పొరేషన్ (కాకినాడ), జూలై 20: ఎప్పటి నుంచో ఎదురుచూస్తున్న గ్రేడ్ 3 పంచాయతీ కార్యదర్శుల పదోన్నతులు జరిగాయి. పంచాయతీ రాజ్ కమిషనర్ కె.కన్నబాబు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. జోన్ 2లోని ఉమ్మడి పశ్చిమగోదావరి,ఉమ్మడి తూర్పుగోదావరి, ఉమ్మడి కృ ష్ణా జిల్లాలకు సంబంధించి గ్రేడ్3 కార్యదర్శులు 268 మంది, జూనియర్ అసిసెంట్లు 96 మంది,శానిటరీ ఇన్‌స్పెక్టర్లు ముగ్గురు,జిల్లా పంచాయతీ, డివిజనల్ పంచాయతీ కార్యాలయాల్లో పనిచేసే జూనియర్ అసిసెంట్లు, టైపిస్టులు 32 మందికి గ్రేడ్2 కార్యదర్శులుగా పదోన్నతులు కల్పించారు.

ఓటు పడింది..

- ప్రశాంతంగా అర్బన్ బ్యాంక్ పోలింగ్
- ఆర్యాపురం బ్యాంక్ ఓటర్లు 74,585
- ఓటేసింది 18,933.. 25.31 శాతమే
- నాలుగో వంతు మాత్రమే ఓటర్లు రాక
- కుట్రపూరితంగా వ్యవహరించిన వైసీపీ
- నేడు కౌంటింగ్‌కు ఏర్పాట్లు పూర్తి

రాజమహేంద్రవరం,జూలై 20 (ఆంధ్రజ్యోతి) : ప్రతిష్ఠాత్మకమైన ఆర్యాపురం కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ పోలింగ్‌పై ఓటరు పెద్దగా ఆసక్తి చూపలేదు. వర్షం ప్రభావమో ఏమో తెలియదు కానీ కేవలం 25.31 శాతం ఓట్లు మాత్రమే పోలయ్యాయి.మొత్తం 16 బ్రాంచిల పరిధిలో 74,585 ఓటర్లు ఉండగా కేవలం 18,876 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. 2014లో జరిగిన ఎన్నికల్లో కూడా కేవలం 18,933 మంది మాత్రమే ఓటు హక్కు వినియోగించుకోవడం గమనార్హం. రూ.వెయ్యి కోట్లకు పైగా టర్నోవర్ ఉన్న బ్యాంక్‌లో 4వ వంతు ఓట్లతోనే పాలకవర్గాలు ఏర్పడ డం అంటే పరిస్థితేంటో అర్థం చేసుకోవచ్చు. రాజమ హేంద్రవరం ఎస్‌కేవీటీ ఇంగ్లీష్ మీడియం స్కూల్, డిగ్రీ కళాశాలలు ఓటర్లతో కిక్కిరిశాయి. ఒక్కొక్కరు పదేసి ఓట్లు వేయవలసి ఉండడం వల్ల ఆలస్యమైంది. ఉదయం 9 గంటలకు కేవలం 725 మంది ఓటు హక్కు వినియోగించుకోగా 10గంటలకు 2,354 మంది, 12 గంటలకు 7,537 మంది, 2గంటలకు 12,701 మంది, 4గంటలకు 18,876 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. 12 గంటల నుంచే పుంజుకుంది. చివరి రెండు గంటల్లో 6 వేల మందిపైగా ఓటేశారు. తెలుగుదేశం, జనసేన బీజేపీ కూటమి చైర్మన్ అభ్యర్థి చల్లా శంకర రావు ప్యానల్‌లో 11 మంది, వైసీపీ నేత నందెపు శ్రీనివాస్ చైర్మన్ అభ్యర్థిగా ఉన్న ప్యానల్ నుంచి 11 మంది పోటీ చేసిన సంగతి తెలిసిందే. మొత్తం 12 డైరెక్టర్ పదవుల్లో ఒకటి ఏకగ్రీవం కాగా 11 డైరెక్టరు పదవులకు పోలింగ్ జరిగింది. మొత్తం 34 మంది అభ్యర్థులు పోటీ పడ్డారు. ఉదయం నుంచి కూటమి ప్యానల్ చైర్మన్ అభ్యర్థి చల్లా శంకరరావు,జనసేన, బీజేపీ నేతలు ఓటర్లకు స్లిప్‌లు పంపిణీ చేసి జాగ్రత్తగా ఓటు వినియో గించుకునే ప్రయత్నం చేశారు. మరో పక్క వైసీపీ నేతలు మోసపూరితంగా వ్యవహరించడం గమనార్హం. వాళ్ల ప్యానల్ నెంబర్లు ఉన్న స్లిప్ మీద చల్లా శంకర రావు ప్యానల్ అని ముద్రించి ఓటర్లకు పంపిణీ చేయడం వివాదాస్పదమైంది.కూటమి ప్యానల్ గెలుస్తుందనే భయంతో వైసీపీ కుట్రపూరితంగా వ్యవహరించిందని జనసేన సిటీ నియోజకవర్గ ఇన్‌చార్జి అనుశ్రీ సత్యనారాయణ ఆరోపించారు.కానీ చల్లా ప్యానలే విజయం సాధిస్తుందన్నారు. ఒక బూత్‌లో వైసీపీ యువనేత గణేష్ రావడంతో రెండు వర్గాల మధ్య వాగ్వాదం జరిగింది.పోలీసులు ఇరువర్గాలను చెదరగొట్టడం గమనార్హం. పోలింగ్ స్టేషన్ల వద్ద బందోబస్తును ఎస్పీ డి.నరసింహ కిశోర్ పరిశీలించారు. అడిషనల్ ఎస్పి ఎస్ఆర్.రాజశేఖరరాజు, డీఎస్పీలు విజయపాల్, ఎం.అంబికా ప్రసాద్ పరిస్థితిని పర్యవేక్షించారు.


ఎస్‌కేవీటీ స్కూల్‌లో ఓటేస్తున్న యువతి

నేడు కౌంటింగ్

ఓట్ల లెక్కింపు ఆదివారం ఉదయం 8గంటల నుంచి ఉంటుందని ఎన్నికల అధికారి వి.కృష్ణకాంత్ తెలిపారు. దీనికి అవసరమైన ఏర్పాట్లను ఎస్‌కెవిటీ డిగ్రీ కళాశాలలో చేసినట్టు చెప్పారు. రెండు కౌంటింగ్ హాళ్లు ఏర్పాటు చేశారు.ఒక్కో హాల్‌లో 13 టేబుళ్లు ఉంటాయని తెలిపారు.పోలీస్ బందోబస్తు మధ్య బ్యాలెట్ బాక్స్ లను ఎస్‌కేవీటీ డిగ్రీకళాశాల స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరిచారు.




ఎస్‌కేవీటీ స్కూల్‌లో ఓటర్ల క్యూ.. కేంద్రం వద్ద చైర్మన్ అభ్యర్థి చల్లా

సొంత జిల్లాలకు తహశీల్దార్లు

రాజమహేంద్రవరం జూలై 20(ఆంధ్రజ్యోతి) : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లా నుంచి ఇతర జిల్లాలకు బదిలీ అయిన తహశీల్దార్లను తిరిగి సొంత జిల్లాకు పంపిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. వీరు వెంటనే విధుల్లో చేరవలసి ఉంది. ఎన్నికల సమయంలో జిల్లాకు వచ్చిన తహశీల్దార్లను రిలీవ్ చేయలేదు. ఇప్పుడు రిలీవ్ చేసి తహశీల్దార్లకు కొత్త పోస్టింగ్‌లు ఇవ్వనున్నారు. ఇప్పటికే పలువులు తహశీల్దార్లు ఎమ్మెల్యేల సిఫారసు లేఖలను తీసుకున్నట్టు సమాచారం.



పొగాకు కేజీ రూ.400

రికార్డు స్థాయి ధర.. రైతుల ఆనందం

గోపాలపురం/ దేవరపల్లి, జూలై 20: పొగాకు పంట ఆరంభం నుంచి ఇప్పటి వరకూ ఎన్నడూ లేనంత రికార్డు స్థాయి ధర శనివారం పలికింది. దీంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.గోపాలపురం పొగాకు బోర్డులో శనివారం నిర్వహించిన కొనుగోళ్లలో గరిష్ఠ ధర రూ.400కి చేరింది. కనిష్ఠ ధర రూ.235.గోపాలపురం పొగాకు బోర్డులో శనివారం 592 బేళ్ళు కొనుగోళ్లకు సిద్ధం చేయగా 81 బేళ్లను తిరస్క రించా రు. వేలం ప్రక్రియలో 37 కంపెనీలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నట్టు వేలం నిర్వహణాధికారి తెలిపారు.దేవరపల్లి కేంద్రంలో కనిష్ఠ ధర రూ. 242తో ఆరంభమై గరిష్ఠ ధర రూ.399కి చేరింది.కావడంతో రైతులు ఆనందానికి అవధులు లేకుండా పోయాయి.అంతర్జాతీయ మార్కెట్‌లో చైనా, బ్రెజిల్, జింబాబ్వే, ఇండోనేషియా దేశాల్లో పొగాకు ఉత్పత్తి తగ్గడంతో మన పొగాకుకు డిమాండ్ ఏర్పడింది.

వెంకన్న ఆలయంలో భక్తజనం

● స్వామివారి ఒక్కరోజు ఆదాయం రూ.22.64 లక్షలు



ఆత్రేయపురం, జూలై 20: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయానికి శనివారం భక్తజనం పోటెత్తారు. వేకువజామునే స్వామి వారికి సుప్రభాతసేవ, నీరాజన మంత్రపుష్పం, ఐశ్వర్యలక్ష్మి హోమం, బాలబోగం తదితర కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించి స్వామివారిని వివిధ రకాల ఫలపుష్పాలతో అలకరించారు. వివిధ రాష్ట్రాల నుండి తరలి వచ్చిన భక్తులు చిరుజల్లులో ఏడు ప్రదక్షణలు నిర్వహించుకుని స్వామివారిని గోవిందనామస్మరణతో స్వామివారిని దర్శించుకున్నారు. వివిధసేవలద్వారా స్వామివారి ఒక్కరోజు ఆదాయం రూ.22.64లక్షలు లభించినట్టు ఉపకమీషనరు కిషోర్‌కుమార్ తెలిపారు.

శృంగారవల్లభస్వామి ఆలయానికి పోటెత్తిన భక్తులు



పెద్దాపురం, జూలై 20: తిరుపతి శృంగారవల్లభస్వామి ఆలయానికి శనివారం భక్తులు అధిక సంఖ్యలో పోటెత్తారు. స్వామివారి దర్శనానికి భక్తులు తెల్లవారుజామునే బారులు తీరారు. టిక్కెట్లవిక్రయం ద్వారా 1,07,020 అన్నదాన విరాళాలు రూ. 27,886 ఆదాయం, కేశఖండన ద్వారా రూ.3,440 తులాభారం రూ.150, లడ్డూ ప్రసాదం ద్వారా 10,800, వెరసి రూ. 1.49,296 ఆదాయం సమకూరినట్లు ఈవో వడ్డి శ్రీనివాస రావు తెలిపాయి.. సుమారు 10వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకుని అన్నప్రసాదాన్ని స్వీకరించారని తెలిపారు.

ఇండియన్ ఎయిర్‌ఫోర్స్‌కు దరఖాస్తులు చేసుకోండి

అమలాపురంటౌన్, జూలై 20: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అగ్నివీర్ వాయు పథకంలో భాగమైన ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ ఉద్యోగాలకు ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్టు జిల్లా ఉపాధి అధికారి జి యి.వసంతలక్ష్మి తెలిపారు. ఎయిర్‌ఫోర్స్‌లో చేరేందుకు ఈనెల 28వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకునే అవకాశం ఉందన్నారు. అర్హత కలిగిన అవివాహితులైన స్త్రీ, పురుష అభ్యర్థులు అర్హులు. అభ్యర్థుల వయోపరిమితి 21 ఏళ్లలోపు ఉండాలి. 2004 జూలై 3 నుంచి 2008 జనవరి 3 మధ్యలో జన్మించిన అభ్యర్థులు అర్హులు. గణితం, ఫిజిక్స్, ఇంగ్లీషు సబ్జెక్టులో 50 శాతం మార్కుల ఉత్తీర్ణతతో ఇంటర్మీడియట్, ఇంజనీరింగ్, డిప్లమో, తత్సమానమైన విద్యార్హత కలిగి ఉండాలన్నారు. ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ ఉద్యోగాల ఎంపిక ప్రక్రియ మూడు విభాగాలుగా ఉంటుందని, ఆన్‌లైన్‌లో రాత పరీక్ష, ఫిజికల్, మెడికల్ ఫిట్‌నెస్ పరీక్షలతో పాటు అర్హత ధ్రువీకరణ పత్రాల పరిశీలన ఉంటుందన్నారు. అభ్యర్థులు రిజిస్ట్రేషన్ ఫీజు కింద రూ.550 చెల్లించాల్సి ఉంటుంది.

పాదగయలో హైకోర్టు న్యాయమూర్తి పూజలు

పిఠాపురం, జూలై 20: పిఠాపురం పట్టణంలోని పాదగయ క్షేత్రాన్ని తెలంగాణా హైకోర్టు న్యాయమూర్తి సాంబశివరావునాయుడు సందర్శించారు. పాదగయలోని కుక్కుటేశ్వరస్వామి, దత్తాత్రేయస్వామి, రాజరాజేశ్వరీదేవి, పురుహూతికా అమ్మవార్లను సతీసమేతంగా దర్శించుకుని పూజలు నిర్వహించారు. వేదపండితులు క్షేత్రప్రాశస్త్యం వివరించి ఆశీర్వచనాలు పలికారు. అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతంపలికి శేషవస్త్రాలతో సత్కరించి ప్రసాదాలు అందజేశారు.

పంటకాల్వలోకి దూసుకెళ్లిన కాలేజీ బస్సు

● విద్యార్థులు సురక్షితం



ఉప్పలగుప్తం, జూలై 20: ఓడ లరేవు నుంచి కూనవరం విద్యార్థులతో వస్తున్న ఓ కళాశాల బస్సు శనివారం సాయంత్రం సరిపల్లి వద్ద పంటకాల్వలోకి బోల్తా కొట్టింది. ఓడలరేవు నుంచి సరిపల్లి మీదుగా కూనవరం వస్తున్న సమయంలో స్టీరింగ్ ఫెయిలవ్వడంతో ఈ ప్రమాదం జరిగినట్టు స్థానికులు తెలిపారు. ప్రమాద సమయంలో బస్సులో ఆరుగురు విద్యార్థులు మాత్రమే ఉన్నారు. స్వల్ప గాయాలతో విద్యార్థులు బయపడ్డారు.

రంపచోడవరం ఐటీడీఏ పీవోగా సింహాచలం



రంపచోడవరం, జూలై20 : రంపచోడవరం ఐటీడీఏ పీవోగా కట్టా సింహాచలంను నియమించారు. ఈయన ఏపీ సీఆర్‌డీఏలో పనిచేస్తున్నారు. బదిలీపై రంపచోడవరం ఐటీడీఏ పీవోగా వస్తున్నారు. 2020 బ్యాచ్‌కు చెందిన సింహాచలం గతంలో రంపచోడవరం సబ్ కలెక్టర్‌గా పనిచేశారు. ఇప్పటివరకు ఇక్కడ పీవోగా పని చేసిన సూరజ్‌గనోరియా గుంటూరు బదిలీ అయ్యారు.



గోదావరి పరవళ్లు

- 4.09లక్షల క్యూసెక్కులు సముద్రంలోకి
- చింతూరు వద్ద 35 అడుగుల శబరి నీటిమట్టం
- గ్రామాలను చుట్టుముట్టిన వరద
- కొట్టుకుపోయిన రహదారులు
- స్థంభించిన రాకపోకలు

ధవళేశ్వరం, జూలై 20: ఎగువ ప్రాంతాల్లో విస్తారంగా కురుస్తున్న వర్షాల వల్ల ఉపనదులతో పాటు వాగులు, వంకలు ఉప్పొంగి గోదావరిలో కలుస్తుండడంతో సీజన్‌లో మొదటిసారిగా గోదావరి వరద నీటితో పరవళ్లు తొక్కుతోంది. ఎగువ నుంచి వస్తున్న వరదనీటితో ధవళేశ్వరం వద్ద నీటిమట్టం పెరుగుతోంది. దీంతో శనివారం సాయంత్రానికి కాటన్ బ్యారేజ్ ధవళేశ్వరం, విజ్జేశ్వరం ఆర్మ్‌లలోని మొత్తం గేట్లను 1.5మీటర్లు, ర్యాలీ, మద్దూరు ఆర్మ్‌లోని మొత్తం గేట్లను 2మీటర్ల మేర పైకి ఎత్తి 4,09,459 క్యూసెక్కులను సముద్రంలోకి విడుదల చేస్తున్నారు. ధవళేశ్వరం వద్ద నీటి మట్టం 8.70అడుగులుగా నమోదైంది.. ఎగువన ఉపనది ఇంద్రావతి, దిగువన శబరి నుంచి వరదనీరు గోదావరికి చేరుతుండడంతో ధవళేశ్వరం వద్ద సోమవారం నాటికి వరద ప్రవాహం మరింత పెరిగి 9లక్షల క్యూసెక్కులకుపైగా వరద నీరు రావచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. ఎగువన భద్రాచలం వద్ద క్రమంగా పెరుగుతున్న నీటి మట్టం శనివారం సాయంత్రానికి 35.20అడుగులకు చేరుకుంది. నీటిమట్టం మరింత పెరగవచ్చని అంచనా.

చింతూరులో అత్యధిక వర్షపాతం

చింతూరు, జూలై 20: చింతూరు డివిజన్ తడసి ముద్దైంది. ఎటుచూసినా వరద నీరే. శనివారం ఉదయానికి చింతూరులో 20.7 సెంటీ మీటర్లు, కూనవరం 6. 6, ఎటపాక 6.8, వరరామచంద్రపురం మండలంలో 8.6 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఈ క్రమంలో శనివారం సాయంత్రానికి చింతూరువద్ద శబరి నీటిమట్టం 35 అడుగులకు చేరుకుంది. చింతూరు మండలంలోని సోకిలేరు, చంద్రవంక, చీకటివాగు, కుయుగూరు, అత్తాకోడళ్ళ వాగు, తడిక వాగులు వరరామచంద్రపురం మండలంలో అన్నవరం వాగు ఉధృతిగా ప్రవహిస్తున్నాయి. కూనవరం మండలంలో కోండ్రాజుపేట, టేకులబోరు గ్రామాల వద్ద రహదారులపై వరద నీరు చేరింది. ఎటపాక మండలం, తోటపల్లి, నెల్లిపాక, నందిగాం గ్రామాల వద్ద వాగులు గోదావరి ఎగపోటుతో నిండుగా ప్రహిస్తున్నాయి. కూనవరం మండల కేంద్రానికి చెందిన పలు కుటుంబాలు, వరరామచంద్రపురం మండలంలోని ఒడ్డుగూడెం, ఒడ్డుగూడెం కాలనీకి చెందిన పలు కుటుంబాలు వారి సామగ్రిని సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. వరరామచంద్రపురం మండలంలో ముంపు ప్రాంతాలకు చెందిన బాధితులకు రేషను సరఫరా చేశారు. ఇక వర్షం ధాటికి చింతూరు మీదుగా ఒడిస్సాకు వెళ్ళే 326 నెంబరు జాతీయ రహదారి కుయుగూరు వద్ద కొట్టుకపోయింది. అదే దశలో చింతూరు కుయుగూరుల నడుమ వాగు వంతెనతో పాటు చింతూరు వరరామచంద్రపురం చింతూరు మండలాల నడుమ పలు వాగుల వంతెనలపై కూడా వదర నీరు ప్రవహిస్తుండడంతో ఆ దిశగా రాకపోకలు పూర్తిగా నిలచిపోయాయి. వాగుల వెంబడి ఎటువంటి ప్రయాణాలను అధికారులు అనుమతించడంలేదు. ఆ మేరకు వాగుల వెంబడి సిబ్బందిని కాపలాగా ఉంచారు. వరరామచంద్రపురం మండలంలోని అన్నవరం వాగు చప్టా కొట్టుకపోవడంతో అధికార యంత్రాంగం మరమ్మత్తులు పనులు చేపట్టి రాకపోకలు పునరావృతమయ్యే దిశగా చర్యలు చేపట్టింది. ముంపు గ్రామాలలో 227 మంది గిర్భణి మహిళలు ఉన్నట్లు వైద్యశాఖ గుర్తించింది. ఆ మేరకు ఆయా ముంపును అనుసరించి గర్భిణి మహిళలను చింతూరు, కూనవరం ఆసుపత్రులకు నాటుపడవలు, ఆటోల ద్వారా తరలిస్తున్నారు. వారందరికి ఆసుపత్రులలో భోజన వసతి సమకూర్చుతున్నారు. ఇప్పటి వరకు చింతూరు ఏరియా ఆసుపత్రికి సాయంత్రం ఏడు గంటల వరకు 36 మంది, కూనవరం ఆసుపత్రికి 15 మంది గర్భిణి మహిళలను తరలించినట్లు డిప్యూటి డిఎంహెచ్‌ఓ పుల్లయ్య తెలిపారు.రాజమండ్రి, పాడేరు ఘాట్లపై ప్రయాణం కేవలం ఉదయం ఆరు గంటల నుండి సాయంత్రం ఏడు గంటల వరకు మాత్రమే నని అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ ఆదేశాలు జారి చేశారు. వర్ష ధాటికి కొండ చెరియలు విరిగిపడే ప్రమాదం ఉన్నందున ఈ మేరకు కలెక్టర్ నిర్ణయం తీసుకోవడం జరిగింది.



చింతూరు-వరరామచంద్రపురం మండలాల నడుమ నీట మునిగిన ప్రధాన రహదారి

సీలేరుకు జలకళ

మోతుగూడెం, జూలై 20: సీలేరు నది పరివాహక ప్రాంతంలో గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు సీలేరు కాంప్లెక్సు పరిధిలోని జలాశయాల్లోకి నీరు చేసి జలకళతో కళకళలాడుతున్నాయి. ఎగువున ఉన్న కొండ ప్రాంతాల నుంచి వర్షపునీరు జలాశయాల్లోకి ఉరకలేస్తూ వచ్చి చేరుతుండటంతో నీటి నిల్వలు క్రమంగా పెరుగుతున్నాయి. సీలేరు కాంప్లెక్సులోని జల విద్యుత్ కేంద్రాలకు నీటి సమస్య తప్పిందని జెన్‌కో అధికార్లు భావిస్తున్నారు. సీలేరు నది పరివాహక ప్రాంతంలో గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు సీలేరు కాంప్లెక్సు ప్రధానమైన జలాశయం అయిన బలిమెల జోలాపుట్‌లో 6.1649 టీఎంసీలు నీటినిల్వలు వచ్చి చేరాయని, అలాగే డొంకరాయి, గుంటవాడ జలాశయాల్లో 3టీఎంసీల వరకు నీటి నిల్వలు వచ్చి చేరాయని జెన్‌కో అధికార్లు తెలిపారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు జోలాపుట్‌కు 4728 క్యూసెక్కులు, బలిమెలకు 31459 క్యూసెక్కులు, గుంటవాడకు 3480 క్యూసెక్కులు, డొంకరాయికి 3591 క్యూసెక్కులు, ఫోర్‌బైకు 2853క్యూసెక్కుల ఇన్‌ఫ్లోస్ వచ్చి చేరుతున్నాయి. డొంకరాయి ఏపీపీ డ్యాం కూడా వరదనీరు ఉధృతంగా వచ్చి చేరుతుంది. శనివారం ఏపీపీ డ్యాంకు 4వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లోస్ వచ్చి చేరడంతో ఇక్కడ నీటి మట్టం పూర్తిస్థాయికి చేరింది. ఏపీపీ డ్యాం పూర్తిస్థాయి నీటి మట్టం 940అడుగులు కాగా శనివారం ఉదయానికి అది పూర్తిస్థాయికి చేరుకోవడంతో జెన్‌కో అధికార్లు అప్రమత్తమై రెండు గేట్లు ఎత్తి 10000 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.



నీట మునిగిన గండిపోశమ్మ ఆలయం

గండిపోశమ్మ ఆలయాన్ని ముంచిన వరద

● ముంపు గ్రామమైన తాళ్ళూరులో చిక్కిన 22 కుటుంబాలు

దేవీపట్నం, జూలై20: గత వారం రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు మండలంలో గోదావరి వరద పెరుగుతూ వచ్చింది. శనివారం నాటికి గండిపోశమ్మ అమ్మవారి ఆలయాన్ని గోపురం వరకు తాకింది. అదేవిధంగా మండలంలోని ఫజుల్లాబాద్, సీతపల్లి తదితర వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. ముంపు గ్రామం తాళ్ళూరులోనే 22 కుటుంబాలు ఉండిపోవడంతో వారంతా వరదధాటికి కొండపైకి వెళ్లి తలదాచుకుంటున్నారు. అధికార యంత్రాంగం చర్యలు తీసుకోవలసి ఉంది. వరద ఉధృతికి ఎక్కడికక్కడ ప్రజలను అధికారులు, పోలీసులు అప్రమత్తం చేస్తూ గోదావరి, వాగుల వద్దకు వెళ్లనీయకుండా చర్యలు తీసుకుంటున్నారు.

కోనసీమను ముంపు నుంచి.. గట్టెక్కించాలి



జడ్పీ స్థాయి సంఘాల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యేలు రామకృష్ణారెడ్డి, ఆనందరావు, ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు

- భారీ వర్షాల నేపథ్యంలో సహాయక చర్యలపై చర్చ
- గ్రామాల్లో పారిశుధ్యంపై దృష్టి సారించాలి
- నిధుల విడుదల కోసం పవన్ కల్యాణ్‌ను కోరదాం
- సాదాసీదాగా జడ్పీ స్థాయీ సంఘాల సమావేశం

కాకినాడసిటీ, జూలై 20: గత కొన్ని రోజులుగా కురుస్తున్న అధిక వర్షాలవల్ల అంటువ్యాధులు ప్రబలకుండా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా అన్ని ఆవాసాల్లో ప్రజారోగ్య పరిరక్షణ, పారిశుధ్య చర్యలను ముమ్మరంగా చేపట్టాలని జిల్లా పరిషత్ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు అధికారులను కోరారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిషత్ స్థాయి సంఘాల సమావేశాలు శనివారం కాకినాడ జడ్పీ కార్యాలయ సమావేశ మందిరంలో జరిగాయి. ఇందులోభాగంగా ఆర్థిక-ప్రణాళిక, గ్రామీణాభివృద్ధి, విద్య-వైద్యం, అభివృద్ధి పనులు తదితర అంశాలపై 1,2,4,7 స్థాయీ సంఘాల సమావేశాలు జడ్పీ చైర్మన్ వేణుగోపాలరావు అధ్యక్షతన జరిగాయి. వ్యవసాయం అంశంపై 3వ స్థాయీ సంఘ సమావేశం వైస్‌చైర్మన్ బుర్రా అనుబాబు, సాంఘిక సంక్షేమం అంశంపై 6వ స్థాయీ సంఘ సమావేశం వైస్ చైర్‌పర్సన్ మేరుగు పద్మలత, స్త్రీ శిశు సంక్షేమం అంశంపై 5వ స్థాయి సంఘ సమావేశం జడ్పీటీసీ రొంగల పద్మావతి అధ్యక్షతన జరిగాయి. సమావేశాలలో జడ్పీ చైర్మన్ వేణుగోపాలరావు మాట్లాడుతూ ఇటీవల ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లావ్యాప్తంగా భారీగా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో ప్రజారోగ్యం, పారిశుధ్యం, ముంపు నివారణ, రహదార్ల నిర్వహణ వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని నాలుగు ఉమ్మడి జిల్లాల అధికారులను కోరారు. తాగునీటి వనరుల క్లీనింగ్, క్లోరినేషన్, నీటి నమూనాల టెస్టింగ్, పైపులైన్లలోకి డ్రైనేజీ కలుషిత నీరు కలువకుండా నివారణ పనులను అన్ని ఆవాసాల్లో చేపట్టాలని పలువురు జడ్పీటీసీ సభ్యులు అధికారులను కోరారు. ఇటీవల బెండపూడి, యు కొత్తపల్లి, ఏవీనగరం గ్రామాల్లో డయేరియా ప్రబలిన నేపథ్యంలో మరింత అప్రమత్తత అవసరమని సూచించారు.

వరద, ముంపు సమస్యలపై ఎమ్మెల్యేల గళం..

గోదావరి వరద వల్ల పంట భూములు ముంపునకు గురికాకుండా నివారించేందుకు కాలువలు, డ్రెయిన్లలో గుర్రపు డెక్క తొలగింపును వెంటనే చేపట్టాలని అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి కోరారు. సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులకు అన్ని కనీస సదుపాయాలు అందేలా చూడాలని ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణ కోరారు. భారీ వర్షాలు కురుస్తున్న పరిస్థితుల్లో కోనసీమలో వరద, ముంపు సమస్యలను అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ ప్రస్తావించారు. రైతుల నుంచి మద్దతు ధరకు కొనుగోలు చేసిన ధాన్యానికి చెల్లింపు జాప్యం జరుగుతోందని, చెల్లింపులు వేగవంతం చేసి రైతులు ఇబ్బందులకు గురికాకుండా చూడాలని 3వ స్థాయీ సంఘ సమావేశంలో సభ్యులు కోరారు. రైతులకు సబ్సిడీ విత్తనాలు, ఎరువుల కొరత లేకుండా చూడాలన్నారు. జిల్లాలో అసంపూర్తిగా మిగిలిపోయిన అంగన్‌వాడీ భవనాల నిర్మాణాలను పూర్తిచేసి వినియోగంలోకి తేవాలని 5వ స్థాయీ సంఘ సమావేశంలో సభ్యులు కోరారు. నిధుల కొరత వల్ల ఆర్థిక, ప్రణాళిక, పనులు ముందుకు సాగడం లేదని, చేసిన పనులకు బిల్లుల చెల్లింపులు కూడా జరగలేదని 6వ స్థాయీ సంఘ సమావేశంలో సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు.

20 నెలలుగా జడ్పీటీసీలకు గౌరవ వేతనాల చెల్లింపులు లేవు..

గడచిన 20 నెలలుగా జడ్పీటీసీ సభ్యులకు గౌరవ వేతనం చెల్లింపులు కూడా జరగలేదని పలువురు జడ్పీటీసీ సభ్యులు చైర్మన్ దృష్టికి తెచ్చారు. జడ్పీకి రావలసిన గ్రాంట్‌ల సత్వర విడుదల కోసం ప్రభుత్వాన్ని కోరి, నిధులు రాగానే అన్ని చెల్లింపులు చేస్తామని చైర్మన్ వేణుగోపాలరావు తెలిపారు. జిల్లా నుంచే శాసనసభలో ప్రాతినిధ్యం వహిస్తున్న రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖామంత్రి కొణిదెల పవన్‌కళ్యాణ్ స్థానిక సంస్థలకు నిధులు విడుదల చేయనున్నట్లు ప్రకటించినందున ఈ నిధుల విడుదల కోసం జడ్పీ ద్వారా కోరదామని వైస్‌చైర్మన్‌లు బుర్రా అనుబాబు, మేరుగు పద్మలత తెలిపారు. సమావేశాల్లో వివిధ ప్రజా ప్రాధాన్యతాంశాలపై సమగ్రమైన చర్చ జరగడం పట్ల జడ్పీ చైర్మన్ వేణుగోపాలరావు సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో జడ్పీ డిప్యూటీ సీఈవో రామగోపాల్, ఉమ్మడి జిల్లా జడ్పీటీసీలు, కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి, పాడేరు జిల్లాలకు చెందిన వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలి

● ఏఐకేఎంఎస్ రాష్ట్ర జనరల్ కౌన్సిల్ సమావేశంలో నాయకులు

రాజమహేంద్రవరం అర్బన్, జూలై 20 : దేశానికి అన్నం పెడుతున్న రైతాంగానికి గిట్టుబాటు ధర కల్పించి వారిని ఆదుకోవాలని ఏఐకేఎంఎస్ ఆలిండియా ప్రధాన కార్యదర్శి అశోక్ ఘోయాల్ కోరారు. రాజమహేంద్రవరం మావో భవన్‌లో శనివారం జరిగిన అఖిలభారత రైతు కూలీ సంఘం (ఏఐకేఎంఎస్) రాష్ట్ర జనరల్ కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం 2024-25 మార్కెటింగ్ సీజన్‌లో వరికి కనీస మద్దతు ధరను కేవలం రూ.117లు మాత్రమే పెంచడం దుర్మార్గమని అన్నారు. ప్రధాని మోదీ సర్కార్ అనుసరిస్తున్న రైతాంగ, ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతిఘటించాలన్నారు. సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ కేంద్ర కమిటీ నాయకురాలు పి.టాన్యా మాట్లాడుతూ కేంద్రంలో మోదీ సర్కార్, రాష్ట్రంలో చంద్రబాబు ప్రభుత్వం బడ్జెట్లలో వ్యవసాయరంగానికి అధిక నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఏఐకేఎంఎస్ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.భాస్కర్ మాట్లాడుతూ వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ శక్తుల కబంధహస్తాల నుంచి కాపాడుకోవాలన్నారు. సభ అనంతరం మావో భవన్ నుంచి గోకవరం బస్టాండు వరకూ రైతు కూలీలు ప్రదర్శన చేశారు. సమావేశంలో ఏఐకేఎంఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు టి.ప్రకాష్, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.రామకృష్ణ, పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.కిరణ్‌కుమార్, సీపీఐ ఎంఎల్ న్యూ డెమాక్రసీ జిల్లా సహాయ కార్యదర్శి సీహెచ్ వెంకటేశ్వర్లు, వి.చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

గురుపౌర్ణమికి పిఠాపురం ముస్తాబు

● దత్తక్షేత్రం, సాయిబాబా ఆలయాల్లో ఏర్పాట్లు



పిఠాపురంలోని శ్రీపాదశ్రీవల్లభ మహాసంస్థానం

పిఠాపురం జూలై 20: దత్తాత్రేయుడు స్వయంభూ వెలసిన క్షేత్రం, శ్రీపాదశ్రీవల్లభుల జన్మస్థానమైన పిఠాపురం పట్టణం గురుపౌర్ణమి వేడుకలకు సిద్ధమైంది. పట్టణంలోని దత్తక్షేత్రాలు, సాయిబాబా ఆలయాల్లో ఈ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించేందుకు ఆయా ఆలయకమిటీలు, దేవదాయశాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నాయి. దత్త క్షేత్రాల్లో వేడుకలకు ఉభయ తెలుగురాష్ట్రాలతో పాటు మహారాష్ట్ర, కర్నాటక, ఒరిస్సా తదితర రాష్ట్రాలు నుంచి భక్తులు అధికంగా తరలివస్తారు. ఇప్పటికే ఆయా ఆలయాల వసతిసముదాయాలు, ప్రవేటు వసతి గృహాలు, లాడ్జిలు మహారాష్ట్ర, కర్నాటక భక్తులతో కిటకిటలాడుతున్నాయి. పట్టణంలోని బైపాస్‌రోడ్డులో గల గోపాల్‌బాబా ఆశ్రమం. అగ్రహారంలోని అనఘాదత్త క్షేత్రం, సినిమాసెంటర్ లోని షిర్డీ సాయినాథ్ మందిరంలో, మెయిన్‌రోడ్డులో గల సాయిబాబా ఆలయంలో గురుపౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు కార్యక్రమాలు జరగనున్నాయి. పట్టణ శివారులోని విశ్వవిజ్ఞానవిద్యా ఆధ్యాత్మిక పీఠం నూతన ఆశ్రమ ప్రాంగణంలో గురుపౌర్ణమి సభ జరగనున్నది. పీఠాధిపతి డాక్టర్ ఉమర్‌ఆలీషా భక్తులనుద్దేశించి అనుగ్రహభాషణ చేస్తారు. సాయిబాబా, దత్త ఆలయాలు సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు.

సౌదీ ఎడారిలో మరో తెలుగోడు

- రక్షించాలంటూ ఇసుకపూడివాసి వీడియో వైరల్
- స్పందించిన లోకేశ్.. రెండ్రోజుల్లో ఇంటికి చేరుస్తామని భరోసా



సౌదీ ఎడారిలో చిక్కుకున్న వీరేంద్రకుమార్

అంబాజీపేట, జూలై 20: ఉమ్మడి చిత్తూరు జిల్లా వాయ ల్పాడు మండలానికి చెందిన శివ ఏడాది దేశంలో చిక్కుకుని నరకయాతన అనుభవించి.. ఎట్టకేలకు మంత్రి లోకేశ్ చొరవతో తిరిగి స్వదేశానికి వచ్చిన విషయం తెలిసిందే. ఈ సంఘటన మరువక ముందే మరో తెలుగోడు సౌదీ ఎడాదిలో చిక్కుకుని అష్టకష్టాలు పడుతున్న వైనం వెలుగులోకి వచ్చింది. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట మండలం ఇసుకపూడి మెరకపేటకు చెందిన సరెళ్ల వీరేంద్రకుమార్ బతుకుదెరువు కోసం సౌదీకి వెళ్లి.. ఏజెంట్ మోసంతో అక్కడి ఎడారిలో చిక్కుకుని నరకయాతన పడుతున్నాడు. వీరేంద్ర వంటమనిషిగా పనిచేసేందుకు ఈ నెల 9న మధ్యవర్తులు, ఏజెంటు ద్వారా ఖత్తర్ దేశానికి వెళ్లాడు. 10న ఖత్తర్‌లో దిగిన అతడిని అక్కడి నుంచి సౌదీ అరేబియాకు పంపించారు. తీరా ఇంటిలో పనులు, వంట పనులు కాకుండా.. వీరేంద్రకుమార్‌ను ఎడారిలో ఒంటెల కాపరిగా నియమించారు. అక్కడ ఎండల తీవ్రత, అధిక ఉష్ణోగ్రతల కారణంగా వీరేంద్రకు రక్తపు వాంతులబారిన పడ్డాడు. ఆ ప్రాంతంలో తాగేందుకు నీరు, ఆహారం దొరక్క నరకయాతన పడుతున్నాడు. దీంతో అతడి ఆరోగ్యం క్షీణించింది. దీంతో నత దయనీయ స్థితిని వివరిస్తూ తల్లిదండ్రులు సరెళ్ల సత్తిరాజు, మరియమ్మ, తమ్ముడు రవీంద్రకు వీరేంద్ర వాట్సాప్‌ద్వారా వీడియో సందేశం పంపించాడు. దీంతో ఆందోళనకు గురైన తల్లిదండ్రులు విషయాన్ని స్థానిక సర్పంచ్ తరపట్ల మోహన్‌సింగ్‌బాబూరావు, ఎంపీటీసీ ముత్తాబత్తుల ప్రశాంత్‌కు తెలిపారు. వారు ఈ నెల 19న అమరావతిలోని ఎన్ఆర్ టీఎస్ విభాగం (తెలుగు సొసైటీ) అధికారులకు వీరేంద్ర ఇబ్బందులను వివరిస్తూ ఫిర్యాదు చేశారు. అలాగే తల్లిదండ్రులు కుమారుడి వీడియోను సోషల్ మీడియాలో పోస్టు చేయడంతో వైరల్ అయింది. ఈ పోస్టుపై మంత్రి నారా లోకేశ్ స్పందించారు. రెండు రోజుల్లో స్వదేశానికి వచ్చే విధంగా చర్యలు తీసుకుంటామని సోషల్ మీడియా వేదికగా ఆయన హామీ ఇచ్చారు. కాగా, తమను ఇబ్బందులు లేకుండా చూసుకుంటానని ఉపాధి కోసం విదేశాలకు వెళ్లిన తమకుమారుడు ఇప్పుడు చావుబతుకుల్లో ఉన్నాడంటూ వీరేంద్ర తల్లిదండ్రులు సరెళ్ల సత్తిరాజు, మరియమ్మ, తమ్ముడు రవీంద కన్నీటి పర్యంతమవుతున్నారు. ఇల్లు కట్టి సెటిల్ అవుతానని, తమ్ముడ్ని ఉన్నత చదువులు చదివిస్తానని చెప్పాడంటూ కొడుకును తలచుకుని రోదిస్తున్నారు. వీరేంద్రకుమార్ కుటుంబ సభ్యులను నియోజకవర్గ టీడీపీ నాయకులు శనివారం పరామర్శించారు. వీరేంద్రను రెండు రోజుల్లో స్వదేశానికి తీసుకువచ్చే విధంగా చర్యలు తీసుకుంటానని మంత్రి లోకేశ్ మాటిచ్చారని, అధైర్యపడొద్దని వారికి ధైర్యం చెప్పారు.

ముగ్గురు మిలీషియా సభ్యుల అరెస్టు



విలేకరు సమావేశంలో మాట్లాడుతున్న చింతూరు ఎఎస్‌పి రాహుల్ మీనా

చింతూరు, జూలై 20: మావోయిస్టు పార్టీకి చెందిన ముగ్గురు మిలీషియా సభ్యులను శనివారం అరెస్టు చేసినట్లు చింతూరు ఏఎస్పీ రాహుల్‌మీనా తెలిపారు. ఈ మేరకు ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలను వెల్లడిం చారు. ఏడుగురాళ్లపల్లి అటవీ ప్రాంతంలో మిలీషియా సభ్యులు సమావేశమైన సమాచారం అందుకున్న చింతూరు పోలీసులు, సీఆర్‌పీఎఫ్ జవాన్లు కూంబింగ్ చేపట్టారు. ఈ క్రమంలో మావోయిస్టు మిలీషియా సభ్యులుగా వ్యవహరిస్తున్న వంజం ఉంగయ్య, కుర్స రాజకుమార్, మడివి ఇరమయ్యలు పోలీసుల చేతికి చిక్కారన్నారు. వారిని అదుపులోకి తీసుకోవడంతోపాటు వారి నుంచి ఒక ప్రెషర్‌బాంబ్, 3 గ్రెనేడ్లు, రెండు ఎలక్ట్రికల్ డిటోనేటర్సు, ఐరన్ ముక్కలు, ఎలక్ట్రికల్ వైర్, బ్యాటరీ, మావోయిస్టులకు చెందిన కరపత్రాలను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన ముగ్గురు మిలీషియా సభ్యులు కూడా ఎటపాక మండలానికి చెందినవారేనన్నారు. వీరిలో ఉంగయ్యది విస్సాపురం పంచాయతీ సంగంపాడుకాగా, 2022లో శబరి ఏరియా కమిటీ కమాండర్ గీత ఇతడిని గ్రామ కమిటీ సభ్యుడిగా నియమించిందన్నారు. కుర్స రాజకుమార్ ది కూడా సంగంపాడు గ్రామమే కాగా, మావోయిస్టు పార్టీ ఇతడిని సంగంపాడు గ్రామ మిలీషియా కమాండర్‌గా నియమించారన్నారు. మడవి ఇరమయ్య చుక్కలపాడు గ్రామం కాగా, మిలీషియా సభ్యుడిగా, గ్రామకమిటీ సభ్యుడిగా వ్యవహరిస్తున్నట్లు ఏఎస్పీ తెలిపారు. ఈముగ్గురు. 2024లో మల్లంపేటలో పోలీసులను హతమార్చేందుకుగాను అంబుష్ వేయడం, ఏడుగురాళ్లపల్లిలో తునికాకు గోదామును తగులబెట్టడం, ఏడుగురాళ్ళపల్లి సంతలో మావోయిస్టు పార్టీ కరపత్రాలను వేయడం లాంటి నేరాలలో పాల్గొన్నారు. ఈ మేరకు ముగ్గురిని అరెస్టు చేసినట్లు ఏఎస్పీ తెలిపారు. కార్యక్రమంలో సీఐ గజేంద్రకుమార్, ఎస్ఐ శ్రీనివాసరావులు పాల్గొన్నారు.

కళాశాల విద్యారంగ అభివృద్ధికి చర్యలు

● కళాశాల విద్యాశాఖ కమిషనర్ పోలా భాస్కర్

రాజమహేంద్రవరంఅర్బన్, జూలై 20 : రాష్ట్రంలో కళాశాల విద్యారంగ అభివృద్ధికి తగిన చర్యలు తీసుకుంటున్నామని, ప్రధానంగా ఇంటిగ్రేటెడ్ స్కిల్ డెవలప్‌మెంట్‌పై అటానమస్ కళాశాలలు ప్రత్యేక దృష్టి పెట్టాలని కళాశాల విద్యాశాఖ కమిషనర్ పోలా భాస్కర్ అన్నారు. రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో అటానమస్ కళాశాలల ప్రధానాచార్యులు, ఇతర ముఖ్య సిబ్బందికి మూడు రోజులపాటు నిర్వహించిన వర్క్‌షాప్ ముగింపు సభలో శనివారం ఆయన మాట్లాడారు. అటానమస్ కళాశాలలతోపాటు ఇతర డిగ్రీ కళాశాలలు అభివృద్ధి పథంలో పయనించాలన్నారు. కళాశాల విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ చప్పిడి కృష్ణ, కమిషనరేట్ అధికారులు కె.విజయబాబు, అనిల్‌కుమార్, ఆర్‌జేడీలు,ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్ర పాల్గొన్నారు.

ఏజెన్సీ సమాచారం



టేకులబోరు, కోనరాజుపేట కాజ్‌వేపై ప్రవహిస్తున్న శబరి వరదనీరు



సిద్ధంగా ఉన్న బోట్లు

ఉరకలేస్తున్న గోదావరి

● ఎడతెరిపిలేని వాన ● పొంగుతున్న వాగులు

కూనవరం, జూలై20: మండలంలో గోదావరి ఉరకలేస్తుంది. ఇటీవల కురిసిన వర్షాలకు ఉధృతంగా ప్రవహిస్తుంది. శబరి గోదావరి సంగమం వద్ద ఈరెండు నదులు ఉగ్రరూపం దాల్చాయి. ప్రజలు ఇప్పటికే పునరావాస కేంద్రానికి తరలి పోతున్నారు. కోనరాజుపేట, టేకులబోరు మధ్య ఉన్న రహదారిపై శబరినీరు ప్రవహిస్తుంది. గతేడాది వచ్చిన వరదల కారణంగా ప్రజలు విపరీతంగా నష్టపోయారు. దీంతో ముందుగానే పునరావాస కేంద్రాలకు తరలివెళ్లిపోతున్నారు. అధికారులు ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. లోతట్టు ఉన్న ప్రాంతాల్లో ఉన్న వారిని మెరక ప్రాంతాలకు తరలించేందుకు సిద్ధమవుతున్నారు.

ఉగ్రరూపం దాల్చిన కొండవాగులు

రాజవొమ్మంగి జూలై 20: గత నాలుగురోజులుగా కురుస్తున్న వర్షానికి మండలంలోని లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. కొండ వాగులు ఉగ్రరూపం దాల్చి రోడ్లపై పొంగిపొర్లడంతో అనేక గిరిజన గ్రామలకు రాకపోకలు నిలిచిపోయాయి. లబ్బర్తి-అనంతగిరి,నెల్లిమెట్ల-లబ్బర్తి,మోల్లిమెట్ల-లాగరాయి,రాజవొమ్మంగి-శాంతినగర్‌ల మధ్య ఆర్అండ్‌బీ రోడ్లపై ఉన్న సప్టలు,వంతెనల పై నుంచి వాగులు పొంగి ప్రవహించడంతో సుమారు 20గ్రామలకు రాకపోకలు నిలిచిపోయాయి. కొండపల్లి గ్రామశివారులో చేపల చెరువుకు గండిపడడంతో పంటపొలాలలోకి చేపలు రావడంతో చేపలు పట్టుకునేందుకు ప్రజలు ఎగబడ్డారు.

వాగులు ఉధృతం

వై.రామవరం, జూలై20: ఎడతెరిపిలేని వర్షాలకు అల్లూరి జిల్లా వై.రామవరం మండలంలో పలు వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. లోతట్టు గ్రామాల్లో గిరిజన ప్రజలకు రాకపోకలు స్తంభించి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత నాలుగు రోజులుగా వర్షాలతో పాటు ఈదురుగాలులు సంభవించడంతో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయమేర్పడుతుంది. పలుచోట్ల చెట్లు విరిగిపడ్డాయి.

నేలకొరిగిన భారీ వృక్షాలు

● నిలిచిపోయిన వాహనాలు ● ప్రయాణికుల ఇక్కట్లు



రోడ్డుకు అడ్డుగా చెట్టు పడిపోవడంతో నిలిచిపోయిన ట్రాఫిక్

మోతుగూడెం, జూలై 20: చింతూరు మండలం మోతుగూడెం పరిధిలో చదలవాడ పంచాయతీ గొడ్లగూడెం గ్రామ పరిధిలో తెల్లవారుజామున భారీ వృక్షం నేలకొరిగింది. దీంతో విజయవాడ నుంచి ఎగువ సీలేరు ఆర్టీసీ బస్సు తెల్లవారుజామున 4.30నిమిషాలకు ఆగిపోయింది. ప్రయాణికులు చాలా ఇబ్బంది పడ్డారు. అటువైపు వెళ్లే వాహనదారులు కూడా తీవ్రమైన అంతరాయం కలిగింది. ఇది గమనించిన గ్రామస్తులు చుట్టుప్రక్కలవారు భారీ వృక్షాన్ని కొట్టి అడ్డు తొలగించారు. భారీ వృక్షాన్ని తొలగించడానికి సుమారు రెండు గంటల సమయం పట్టింది. చెట్టు తొలగించడంతో వాహన రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

ఆసుపత్రిలో ప్రసవాలు



చింతూరు ఆసుపత్రిలో ప్రసవించిన మహిళ

చింతూరు, జూలై 20 : విలీన మండలాలకు చెందిన వరద ముంపు ప్రాంతా లలో గర్భిణి మహిళలను చింతూరు కూనవరం ఆసుపత్రులకు తరలించే ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ మేరకు చింతూరు ఏరియా ఆసుపత్రికిగాను శనివారం ఏడుగంటల వరకు 36 మందిని కూనవరం ఆసుపత్రికి 15 మంది గర్భిణులను తరలించారు. వీరిలో చింతూరు మండలం, ఏజి కొడేరుకు చెందిన పండా జయసుధ మగబిడ్డకు జన్మనిచ్చింది.

28 నుంచి అమరవీరుల సంస్మరణ వారోత్సవాలు జరుపుకుందాం

● మావోయిస్టు ఆజాద్ పేరిట సామాజికమాధ్యమాల్లో విడుదలైన లేఖ

ఎటపాక, జూలై 20: ఈనెల 28 నుంచి ఆగస్టు 3 వరకు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను ఘనంగా జరుపుకుందామని భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) భద్రాద్రి కొత్తగూడెం- అల్లూరిసీతారామరాజు డివిజన్ కమిటీ మావోయిస్టు ఆజాద్ పిలుపునిచ్చారు. ఈమేరకు శనివారం సామాజికమాధ్యమాల్లో అజాద్ పేరిట లేఖ విడుదలైంది. ఇందులో కేంద్ర ప్రభుత్వం లోని మోదీ నాయకత్వంలో బీజేపీ 2047 వరకు బ్రహ్మణీయ హిందూ రాజ్యం నిర్మించే లక్ష్యంతో సామ్రాజ్యవాదుల, కార్పోరేట్ల ప్రయోజనాలకు ప్రోత్సహి స్తోందని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం మావోయిస్టే పార్టీ దేశ భద్రతలకు ప్రమాదకరంగా భావించి, వ్యూహాత్మక దాడులు చేస్తోందని అన్నారు. ఈ ఏడాది జరిపిన దాడుల్లో 194మంది కామ్రేడ్స్ ప్రజలు ప్రాణాలు కోల్పోయారని అన్నారు. 2024 కగార్ ఆపరేషన్ పేరుతో అత్యంత క్రూరమైన దాడులు ప్రారంభించారని, హిందూత్వ ఫాసిజం రెచ్చిపోయి దళితులు, ఆదివాసీ లు, ముస్లింలు, క్రిష్టియన్లపై దాడులు పెరిగాయన్నారు. ప్రజలపై కొనసాగుతున్న విప్లవ ప్రతిఘాతక కగార్ ఆపరేషన్‌ను ప్రజా ఉద్యమాల ద్వారా ఓడిద్దామని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌లో రక్షణ, పోలీసు శాఖలకు అధిక నిధులు కేటాయిస్తూ అత్యాధునిక ఆయుధాలతో అణిచివేత యంత్రాలను తయారు చేస్తున్నా రని పేర్కొన్నారు. ఈ నెల 28 నుంచి గ్రామ గ్రామాన సంస్మరణ వారోత్సవాలు జరపాలన్నారు. నక్సల్బరీ ప్రజాయుద్ధ బాటే దేశ విముక్తికి మార్గమని వెలుగెత్తి చాటుదాని పిలుపునిచ్చారు. అమరవీరుల ఆశయాల వెలుగులో ప్రజా యుద్ధాన్ని తీవ్రతరం చేద్దామని పిలుపునిచ్చారు.

సత్వరంగా వరద సహాయక చర్యలు చేపడతాం

● ఎమ్మెల్యే శిరీషాదేవి

చింతూరు, జులై 20 : వరద ముంపు ప్రాంత ప్రజలకు ప్రభుత్వం సత్వరంగా సహాయక చర్యలు చేపట్టనున్నట్లు శిరీషదేవి పేర్కొన్నారు. శనివారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. ఇప్పటికే ముంపు ప్రభా విత ప్రజలకోసం బఫర్ స్టాకు సిద్ధం చేసినట్లు తెలి పారు. చింతూరు ఐటీడీఏ పీవో కావూరి చైతన్య, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ పుల్లయ్యతో పాటు విలీన మండలాల తహసీల్దార్లు, ఎంపీడీవోలతో తాను ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తున్నట్లు తెలిపారు. వరద ఉధృతిని అనుసరించి సురక్షిత ప్రాంతాలకు తరలించే ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. వరద తగ్గిన వెంటనే వర్షపు ధాటికి కొట్టుకుపోయిన రహదారులను మెరుగుపర్చి రాకపోకలకు ఎటువంటి అవాంతరాలు చోటుచేసుకోకుండా చర్యలు తీసుకోనున్నట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. వాగులు, నదుల వద్దకు ఏ ఒక్కరు వెళ్లవద్దని, అప్రమత్తంగా ఉండాలని ఆమె సూచించారు. వరద తగ్గిన వెంటనే ప్రభావిత గ్రామాలలో పర్యటించనున్నట్లు తెలిపారు.

ఉప్పొంగిన బురద కాలువ



- శ్రీరంగపట్నం గ్రామాన్ని ముంచెత్తిన వరదనీరు
- మునిగిన ప్రాథమిక పాఠశాల
- వందలాది ఎకరాల్లో నీట మునిగిన వరి పంట

కోరుకొండ, జూలై 20: నాలుగు రోజులుగా ఏజెన్సీ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు నెల్లిపూడి వాగు పొంగి ప్రవహిస్తోంది. బురద కాలువకు చేరడంతో శనివారం ఉదయం నుంచి శ్రీరంగపట్నం జంక్షన్ వద్ద వరదనీరు అర్అండ్‌బీ రోడ్డుపై ప్రవహించి గ్రామంలోకి చేరింది. శ్రీరంగపట్నం, ఎన్టీఆర్ విగ్రహం సమీపంలోని వంతెన పైనుంచి పెద్ద ఎత్తున వరద నీరు పొంగి ప్రవహిస్తోంది. స్థానిక సొసైటీ, మోదకొండమ్మ ఆలయం వరకు ప్రవహించడంతో శివాలయంలోని ప్రాథమిక పాఠశాలకు చేరింది. పాఠశాల ఆవరణ, తరగతి గదులు వరద నీటితో నిండిపోయాయి. వరద నీరు కాపవరం, మునగాల చెరువులకు చేరి అక్కడ నుంచి తొర్రిగడ్డ ముంపు కాలువ ద్వారా గోదావరిలో కలిసింది. ఈ క్రమంలో శ్రీరంగపట్నం, మునగాల, కోరుకొండ, కాపవరం తదితర గ్రామాల్లో వందలాది ఎకరాల్లో వరి పంట నీట మునిగింది. అధికారులు గ్రామంలో వరద పరిస్థితి గమనిస్తూ సహాయ చర్యలు చేపట్టారు. సర్పంచ్ మద్దాల రమణ, రెవెన్యూ, ఇరిగేషన్, పంచాయతీ రాజ్ అధికారులతో కలిసి బురద కాలువకు గతంలో పడిన గండ్ల వద్ద చేసిన తాత్కాలిక మరమ్మతులను ఎప్పటికప్పుడు గమనిస్తున్నారు. ప్రస్తుతానికి బురద కాలువ ఉధృతంగానే ఉంది. శనివారం రాత్రికి సూరంపాలెం రిజర్వాయర్ నుంచి నీరు విడుదల చేస్తే వరద మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. మండలంలోని నర్సాపురం, జంబుపట్నం, బూరుగుపూడి, గుమ్ములూరు, బుచ్చింపేట, కాపవరం గ్రామాల్లోని పల్లపు ప్రాంతాల్లో వరి పంట నీట మునిగింది. రెండు మూడు రోజుల్లో వర్షం తగ్గకపోతే ఇటీవల వేసిన వరినాట్లు, నారుమళ్లు దెబ్బతింటాయని రైతులు ఆందోళన చెందుతున్నారు.

పంట పొలాల్లో చేపల వేట

ఒక ప్రక్క గ్రామంలోకి వరద నీరు ప్రవేశించి ఆందోళన కలిగిస్తుండగా మరో పక్క స్థానిక సాధువుల మందిరం ఏరియాలో శనివారం తెల్లవారుజామున పెద్ద ఎత్తున చేపలు ఎదురెక్కాయి. దీంతో ఉదయాన్నే వ్యవసాయ పనుల నిమిత్తం పనులకు వెళ్లిన రైతులు, కూలీలకు పెద్దపెద్ద బొచ్చులు(5 కేజీలు) దొరికాయి. దీంతో కోరుకొండ, శ్రీరంగపట్నం గ్రామాల ప్రజలు చేపల కోసం పరుగులు తీశారు. ఇసిరి వల, పందిరి వల, ఊతల సహాయంతో ఎవరికి దొరికిన చేపలు వారు పట్టుకుపోయారు. గుమ్మలదొడ్డి, అచ్యుతాపురం చెరువుల మీదుగా వరద నీరు రావడం, శ్రీరంగపట్నం సమీపంలోని రాజుల చెరువుకు చేరడంతో చెరువు చేపలు ఎదురెక్కి రోడ్లపైన, పంట పొలాలకు చేరడంతో స్థానికులు పట్టుకున్నారు.

కడియంలో ఇల్లు నేలమట్టం

కడియం, జూలై 20: మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు కడియం అరుంధతిపేటలో తాతపూడి శ్రీరాములుకు చెందిన ఇల్లు నేలమట్టమైంది. అయితే ఎటువంటి ప్రాణహాని జరగలేదు. శనివారం టీడీపీ మండలాధ్యక్షుడు, ఉపసర్పంచ్ వెలుగుబంటి నాని సదరు ఇంటిని పరిశీలించారు. న్యాయం జరిగేలా చూస్తామన్నారు. కాగా వెంకటసూర్య థియేటర్ రోడ్డులో సావిత్రికి చెందిన ఇంటి గోడ పడిపోయింది. అలానే కప్పల వీర్రాజు ఇంటిపై కప్పు వర్షాలకు కుంగిపోయింది. ఇదిలా ఉండగా స్థానిక ఉన్నత పాఠశాల ఆవరణలో వర్షంకు నీరు నిలిచిపోయింది. దీంతో పాఠశాల గ్రీన్‌కోర్ ఉపాధ్యాయుడు గొల్లపల్లి సత్యనారాయణ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు పలుగు, పార పట్టుకుని రెండు గంటల పాటు శ్రమదానం చేసి నీరు పోయే ఏర్పాట్లు చేశారు.

80 ఎకరాల్లో నీటమునిగిన వరి పంట

రంగంపేట, జూలై 20: నాలుగు రోజులుగా కురుస్తున్న అధిక వర్షాల కారణంగా మండలంలో సుమారు 80 ఎకరాల వరిచేను నీట మునిగిందని వ్యవసాయశాఖాధికారి శ్రీనివాసరావు తెలిపారు. శనివారం ఆయన వెంకటాపురం, దొడ్డిగుంట గ్రామాల్లో నీట మునిగిన వరి పొలాలను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. అనంతరం స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ మండలంలో ఏటా 2550 హెక్టార్లలో వరి సాగవుతుందని, ఇప్పటివరకు 1248 హెక్టార్లలో నాట్లు వేశారన్నారు. వర్షాల వల్ల వెంకటాపురం, దొడ్డిగుంట గ్రామాల్లో సుమారు 80ఎకరాలు వరిచేను ముంపుకు గురైందన్నారు. ముంపు పొలాల్లోని నీటిని వీలైనంత త్వరగా బయటకు పోయేలా ఏర్పాటు చేసుకుని, ఎకరానికి 20 కిలోల యూరియా, 20 కిలోల పొటాష్ బూస్టర్ డోస్‌గా వేయాలని ఏవో చెప్పారు. తెగుళ్ల నివారణకు కార్బండిజం 1గ్రాములు లేదా మాంకోజబ్ 3గ్రాములు లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలని చెప్పారు. అలాగే మండలంలో వర్షాల కారణంగా ఉద్యాన పంటలను నష్టాన్ని ప్రాథమిక అంచనా వేసేందుకు అనపర్తి ఉద్యాన శాఖాధికారి దివ్యశ్రీ పరిశీలించారు. సింగంపల్లి, నల్లమిల్లి, కోటపాడు, రంగంపేట గ్రామాల్లో ప్రస్తుతం వంగ, బెండ, చిక్కుడు, మిరప, కాకర, ఆకాకర, బీర, ఆనబ పంటలను సుమారు 50 ఎకరాలలో సాగు చేస్తున్నారని తెలిపారు. పొలంలో నీరు నిల్వలేకుండా చేసి, వర్షాలు తగ్గిన తరువాత కలుపు తీసివేయాలన్నారు. ఎండు తెగులు రాకుండా కాపర్ ఆక్సిక్లోరైడ్ 3గ్రాములు లీటర్ నీటిలో కలిపి మొక్కల మొదల్లో పోయాలని, ఆకుమచ్చ, బూజు తెగులు నివారణకు కార్బెండిజం 1గ్రాము లేదా మాంకోజెబ్ 2.5 గ్రాములు లీటర్ నీటిలో కలిపి పిచికారి చేయాలని రైతులకు సూచించారు. వర్షం ఆగిన తరువాత 19.19.19 లేదా 13.0.45 వంటి పోషకాలను పంటపై పిచికారి చేయాలన్నారు. పురుగులు నివారణకు క్లోరిపైరిఫాస్ 2ఎంఎల్ లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. ఆయిల్‌పామ్ లేత తోటల్లో ఎక్కువ రోజులు నీరు నిల్వ ఉంటే మొవ్వకుళ్లు ఆశించే అవకాశం ఉందని, దీని నివారణకు కార్బెండజిం 1గ్రాము లీటర్ నీటిలో కలిపి మొవ్వ భాగంలో పిచికారీ చేయాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో ఉద్యాన విస్తరణాధికారి ఆర్.అరవింద్‌సాయి, ఉద్యాన వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.



శ్రీరంగపట్నం పంట పొలాల్లో చేపల వేట



కడియం హైస్కూల్లో నిలిచిన వర్షపు నీరు



కడియం హైస్కూల్లో వర్షపు నీరు పోయేందుకు శ్రమదానం చేస్తున్న ఉపాధ్యాయులు



రంగంపేట: సింగంపల్లిలో వంగ మొక్కలను పరిశీలిస్తున్న ఉద్యాన శాఖాధికారి దివ్యశ్రీ

ముంపు సమస్య శాశ్వత పరిష్కారానికి కృషి

ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి

బిక్కవోలు, జూలై 20: గత ప్రభుత్వం ఐదేళ్లల్లో మురికి కాలువల్లో పూడికలు, తూడు తొలగించకపోవడంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కోవలసి వచ్చిందని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. శనివారం ఆయన మండలంలోని కొంకుదురు, ఆరికరేవుల, మెళ్లూరు గ్రామాల్లో ముంపునకు గురైన పంట పొలాలతో పాటు బిక్కవోలు, ఏలేరు డ్రైన్లను రైతులు, ఇరిగేషన్ అధికారులతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ డ్రైన్లు తూడుతో పూడుకుపోవడంతో కొంకుదురు, మెళ్లూరు, ఆరికరేవుల గ్రామాల్లోని 600 ఎకరాల్లో పంట నీట మునిగిందన్నారు. నియోజకవర్గంలో తుఫానులు, భారీ వర్షాల సమయంలో పంటలు ముంపునకు గురికాకుండా శాశ్వత పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 45 రోజులు కాకుండానే గోదావరి జిల్లాలో మురికి కాలువల్లో పూడికతీతకు రూ.25 కోట్లు మంజూరు చేసిందన్నారు. ముంపు నుంచి రైతులను ఆదుకునే దిశగా గోదావరి డెల్టాలోని మురుగు కాలువల ఆధునీకరణకు ప్రభుత్వం చర్యలు తీసుకోనుందని ఎమ్మెల్యే అన్నారు. ఆరికరేవులలోని తుల్యభాగ డ్రెయిన్‌లోని తూడును సర్పచ్ రెడ్డి నాగవేణికుమారి, రైతులు కలసి ప్రొక్లెయినర్‌తో తొలగించారు. ఎమ్మెల్యే వెంట కూటమి నేతలు కొవ్వూరి వేణుగోపాలరెడ్డి, రెడ్డి శ్రీను, కొర్ల వినాయకరావు, మహిపాల సోమినాయుడు, గంగుమళ్ల శ్రీనివాస్, వట్టూరి అర్జున్, ఇరిగేషన్, పంచాయతీ అధికారులున్నారు.



కొంకుదురులో మునిగిన పొలాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నల్లమిల్లి

ప్రశాంతంగా ఆర్యాపురం అర్బన్ బ్యాంకు ఎన్నికలు



దివాన్‌చెరువులో పోలింగ్ కేంద్రం వద్ద బారులు దీరిన ఓటర్లు

దివాన్‌చెరువు, జూలై 20: ఆర్యాపురం అర్బన్ బాంకు ఎన్నికలు శనివారం దివాన్‌చెరువులో ప్రశాంతంగా జరిగాయి. రాజానగరం మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 2665 మంది ఓటు వేసేందుకు వీలుగా కోఆపరేటివ్ బ్యాంకులో రెండు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఎడతెరిపిలేకుండా కురిసిన వర్షాన్ని సైతం లెక్కచేయకుండా వివిధ గ్రామాల నుంచి ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు వచ్చి లైన్లలో బారులు తీరి నిలబడి ఓటు వేశారు. 49వ పోలింగ్ కేంద్రంలో 1350 మంది ఓటర్లుకు గాను 883 మంది, 50వ పోలింగ్ కేంద్రంలో 1315 మంది ఓటర్లకు 742 మంది ఓట్లు వేశారని సిబ్బంది తెలిపారు. ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, టీడీపీ నియోజకవర్గం ఇన్‌చార్జి బొడ్డు వెంకటరమణచౌదరి పోలింగ్ కేంద్రం వద్దకు వచ్చి ఎన్నికలు జరిగిన తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా కూటమి అభ్యర్థి నీలపాల సూర్యసత్యనారాయణ విజయం సాధిస్తారని ఎమ్మెల్యే బత్తుల ఆశాభావం వ్యక్తం చేశారు.

- ఓటు హక్కు వినియోగించుకున్న 1625 మంది ఓటర్లు

కూటమి ప్యానల్ విజయం ఖాయం : ఎమ్మెల్యే ఆదిరెడ్డి

రాజమహేంద్రవరం సిటీ, జూలై 20: రాజమహేంద్రవరంలో ప్రతిష్టాత్మకంగా జరిగిన ది ఆర్యాపురం కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ ఎన్నికల్లో కూటమికి చెందిన చల్లా శంకర్రావు ప్యానల్ విజయం ఖాయమని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. ఎస్‌కేవీటీ కళాశాల ప్రాంగణంలో శనివారం బ్యాంక్ ఎన్నికల పోలింగ్ సరళిని పరిశీలించి మాట్లాడారు. ఓటర్లు చాలా ఓపికగా వర్షంలో క్యూలో నిలబడి ఓట్లు వేశారన్నారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల మాదిరిగా ఓటరు చైతన్యవంతంగా వ్యవహరించాడన్నారు. ఆయన వెంట మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాశి నవీన్‌కుమార్, మరుకుర్తి రవియాదవ్ ఉన్నారు.



రాజమహేంద్రవరంలో ఓటరు స్లిప్ చూస్తున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు

డీఈవో.. గోనగూడెం పాఠశాల పరిశీలన



రికార్డులు పరిశీలిస్తున్న డీఈవో వాసుదేవరావు

కోరుకొండ, జూలై 20: మండలంలోని పశ్చిమగోనగూడెం మోడల్ ప్రాథమిక పాఠశాలను శనివారం జిల్లా విద్యాశాఖాధికారి కె.వాసుదేవరావు శనివారం సందర్శించారు. పాఠశాలలో మధ్యాహ్నభోజన నిర్వహణ, ఇతర రికార్డులను పరిశీలించారు. ప్రధానోపాధ్యాయుడు ఎస్‌వీఎస్ ప్రసాద్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. అనంతరం ఆయన గుమ్మళ్లదొడ్డి పాఠశాల పరిశీలనకు వెళ్లారు. ఇదిలా ఉండగా కాపవరం పాఠశాలను ఎంఈవో సుజాత సందర్శించి రికార్డులు పరిశీలించారు. కాగా వర్షాల నేపథ్యంలో శనివారం పాఠశాలలకు సెలవు ఇచ్చినప్పటికీ ఉపాధ్యాయులు యథావిధిగా స్కూళ్లకు సకాలంలో వెళ్లాలని ఉదయం పాఠశాల ప్రధానోపాధ్యాయులకు మెసేజ్ రావడంతో ఉపాధ్యాయులు పాఠశాలలకు పరుగులు తీశారు.

జనసైనికుల కుటుంబాలకు ఆర్థిక సాయం



బిక్కవోలు, జూలై 20: ఇటీవల మండలంలో మృతి చెందిన జనసైనికుల కుటుంబాలకు పార్టీ శ్రేణులు సమకూర్చిన ఆర్థిక సాయాన్ని శనివారం పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు అందజేశారు. ఈ సందర్భంగా బిక్కవోలుకు చెందిన ఎడ్ల నాగేంద్రప్రసాద్ మృతి చెందడంతో అతని తండ్రి రామకృష్ణకు రూ.51 వేలు, ప్రమాదంలో గాయపడిన భీమిరెడ్డి గణపతిరావుకు రూ.26 వేలు, మెళ్లూరుకు చెందిన అమజాల పశులయ్యకు రూ.30 వేలు అందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి జనసైనికుడు ఈ నెల 18 నుంచి 28 వరకూ జరిగే పార్టీ సభ్యత్వంలో నమోదు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్ రావాడ నాగు, మండలాధ్యక్షుడు ఇందల వీరబాబు, నేతలు అరుణ్‌కుమార్, గుత్తుల శివకొండ, ముమ్మిడి వీర్రాఘవులు, వడ్లమూరు గోవిందరాజు, నక్క ప్రభుదాస్ తదితరులు పాల్గొన్నారు.

జేసీ తేజ్‌భరత్‌కు అభినందన



రాజమహేంద్రవరం కల్చరల్, జూలై 20: వినియోగదారుల రక్షణ చట్టాన్ని ప్రజల్లోకి మరింతగా తీసుకు వెళ్లాలని జేసీ తేజ్‌భరత్ సూచించారు. కలెక్టరేట్‌లోని జేసీ చాంబర్‌లో శనివారం డీసీసీవీ, విజిలెన్స్ కమిటీ సభ్యులు గొట్టిముక్కల అనంతరావు,దర్నాలకోట వెంకటేశ్వరరావు ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు.

బీజేపీలో చేరికలు

రాజమహేంద్రవరం అర్బన్, జూలై 20 : రాజమహేంద్రవరం 45వ డివిజన్‌కు చెందిన వరలక్ష్మి, మరికొందరు శనివారం బీజేపీలో చేరారు. రాజమహేంద్రవరం బీజేపీ కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు బొమ్ముల దత్తు, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు రేలంగి శ్రీదేవి, మండల అధ్యక్షుడు కాకరాల పవన్ పార్టీ కండువాను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మీడియా కన్వీనర్ వీరా వీరాంజనేయులు, ఓబీసీ జోనల్ ఇన్‌చార్జి కురగంటి సతీష్, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు కాలెపు సత్యసాయిరాం, రాజుల కుమారి, రాయుడు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీగణపతిని దర్శించిన తెలంగాణ హైకోర్టు జడ్జి



బిక్కవోలు లక్ష్మీగణపతిని దర్శిస్తున్న తెలంగాణ హైకోర్టు జడ్జి సాంబశివరావునాయుడు

బిక్కవోలు, జూలై 20: బిక్కవోలులోని ప్రాచీన ఆలయాలను తెలంగాణా హైకోర్టు జడ్జి సాంబశివరావు నాయుడు శనివారం కుటుంబ సభ్యులతో కలసి దర్శించారు. ముందుగా లక్ష్మీగణపతిని దర్శించి ఆపై గోలింగేశ్వర, కుమారసుబ్రహ్మణ్యేశ్వరస్వామి వార్లను దర్శించి ప్రత్యేక పూజలు జరిపారు. ఆలయ ఈవో ఆకెళ్ల భాస్కర్ పూర్ణకుంభ స్వాగతం పలికి ఆలయ మర్యాదలతో సత్కరించారు.

రూ.33 కోట్లతో రోడ్లు, డ్రైన్లు నిర్మిస్తాం

మండల సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే బత్తుల



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బత్తుల

కోరుకొండ, జూలై 20: నియోజకవర్గంలోని గ్రామాల్లో రోడ్లు, డ్రైన్ల నిర్మాణానికి రూ.33 కోట్ల అంచనాతో ప్రతిపాదనలు తయారు చేసి ఉన్నతాధికారులకు నివేదించామని, 15రోజుల్లో పనులు ప్రారంభిస్తామని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ పేర్కొన్నారు. శనివారం మధ్యాహ్నం ఎంపీపీ ఉల్లి సూర్యకుమారి అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశానికి ఆయన విచ్చేసి విద్య, వైద్యం, వ్యవసాయం, పశుసంవర్ధకం, ఉపాధి హామీ శాఖల పనితీరుపై సమీక్షించారు. ఈ సందర్భంగా కార్యాలయ ఆవరణలో ఎమ్మెల్యే మొక్క నాటారు. ఎంపీడీవో హేమసుందర్రావు ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో సర్పంచ్‌లు కర్రి లక్ష్మీసరోజ, ఉల్లి అప్పన్నదొర, నక్కా రాంబాబు, జాజుల రాము, రొంగల దేవిక, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు, అధికారులు పాల్గొన్నారు.

ఉమ్మడి తూర్పున 7,500 కోట్ల వ్యాపారం

బ్యాంక్ బరోడా ఏజీఎం రవీంద్రనాథ్ ఠాగూర్



రాజమహేంద్రవరం సిటీ, జూలై 20: ఒక చిన్ని కుగ్రామంలో ప్రారంభమైన బ్యాంక్ ఆఫ్ బరోడా ఈ రోజు దేశంలో 28 రాష్ట్రాలతో పాటు 25 దేశాల్లో సేవలందిస్తోందని బ్యాంక్ రాజమండ్రి ప్రాంతీయ కార్యాలయం అధికారి, అసి స్టెంట్ జనరల్ మేనేజరు ఎస్.రవీంద్రనాథ్ ఠాగూర్ తెలిపారు. రాజమహేంద్రవరం ఇన్నీసుపేటలోని ప్రాంతీయ కార్యాలయంలో శనివారం నిర్వహించిన బ్యాంక్ ఆఫ్ బరోడా 117వ ఆవిర్భావ దినోత్సవంలో ఆయన మాట్లాడారు. 1908 జూలై 20న బరోడా మహారాజు శ్రీసయాజీరావు గైక్వాడ్ -3 మొదటి బ్రాంచ్‌ను స్థాపించారని చెప్పారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 50 శాఖలున్నాయని మొత్తం 7500 కోట్ల బిజినెస్ చేస్తున్నామని చెప్పారు. ముందుగా బ్యాంకు వ్యవస్థాపకుడు బరోడా మహారాజు శ్రీసయాజీరావు గైక్వాడ్ -3 చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు.

ప్రభుత్వం నష్టపరిహారం ఇవ్వకుంటే పురుగుల మందు తాగుతా!

సామాజిక మాధ్యమాల్లో రైతు వీడియో



సీతానగరం, జూలై 20: తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలం చినకొండేపూడి గ్రామానికి చెందిన రైతు ముంపుకు గురైన తన పొలంలో పురుగుల మందు డబ్బా చేతబట్టి ప్రభుత్వం తనకు నష్టపరిహారం ఇవ్వకుంటే పురుగుల మందు తాగుతానంటూ చేసిన వీడియో సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతోంది. ఐదెకరాల పొలం కౌలుకు తీసుకుని రూ.25 వేలు పెట్టుబడి పెట్టి వరినాట్లు వేయగా అధిక వర్షాలకు నీట మునగడంతో నష్టపోయానని తనను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నట్టు ఆ వీడియోలో ఉంది.

శాకంబరిగా శ్యామలాంబ



రాజమహేంద్రవరం రూరల్, జూలై 20: మండలం కాతేరులో శ్యామలాంబ అమ్మవారు శుక్ర, శని వారాల్లో శాకాంబరిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆషాఢమాసంలో అమ్మవారి ఉత్సవాల్లో భాగంగా ఆలయంలో ప్రత్యేక పూజలు జరుగుతున్నాయి. అమ్మవారికి భారీగా సారెను భక్తులు సమర్పించారు.

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

తూర్పుగోదావరి

జిల్లా వార్తలు

ఆదివారం 21 జూలై 2024 | 5



ఊళ్లు..కన్నీళ్లు!



ఊళ్లోకొచ్చిన వరద : నిడదవోలు మండలం తాళ్లపాలెంలో రోడ్డుపై వరద



అప్రమత్తం : నిడదవోలు మండలం శింగవరంలో పునరావాస కేంద్రం వద్ద కలెక్టర్ ప్రశాంతి సూచనలు



రోడ్డెక్కిన వరద : కోరుకొండ మండలం శ్రీరంగపట్నంలో రోడ్డుపై పారుతున్న వరద

జోరు తగ్గిన వాన.. వీడని ముంపు

- నాలుగు రోజుల పాటు వాన
- శనివారం కాస్త తగ్గుముఖం
- నీట మునిగిన ఊళ్లు.. చేలు
- 217 గ్రామాల్లో ముంపు
- రైతన్నకు మిగిలింది కన్నీరు
- ఉప్పొంగుతున్న గోదావరి
- నీట మునిగిన రేవులు

రాజమహేంద్రవరం, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : ఊళ్లు.. నీళ్లు.. కన్నీళ్లు.. గత నాలుగు రోజులుగా ఎడతెరిపి లేకుండా చినుకులు పడుతూనే ఉన్నాయి.. దీంతో ఊళ్లు.. చేలు నీటిలో ముంపులోనే ఉన్నాయి.. ఇటు ప్రజలు.. అటు రైతులు కన్నీళ్లు పెడుతూనే ఉన్నారు.చినుకు చూసి వణికిపోతున్నారు. వరుణదేవా కరుణించవా అంటూ వేడుకుంటున్నారు..ఎక్కడి కక్కడ జనజీవనం స్తంభించడంతో ఇబ్బందులు పడుతున్నారు. వాన జోరు శనివారం కాస్త తగ్గినా తగ్గినా జిల్లాలో చేలన్నీ ముంపులోనే ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా చాలా గ్రామాలు నీటి ముంపులోనే ఉన్నాయి.అనేక గ్రామాల్లో రోడ్లపై నుంచి నీరింకా ప్రవహిస్తూ ఉంది. వాన తగ్గుముఖం పట్టిందంటే గోదావరి వరద పెరుగుతుండడంతో రైతాంగం వణికిపోతున్నారు. కోరుకొండ మండలం శ్రీరంగపట్నంలో జల్లకాలువ పొంగడంతో రోడ్లపై నీరు ప్రవహిస్తుంది. ఎర్రకాల్వ పొంగడంతో నిడదవోలు మండలం తాళ్లపాలెం నీట మునిగింది. కొవ్వాడ కాలువ పొంగడంతో తాళ్ళపూడి మండలంలో వేలాది ఎకరాలు నీట మునిగాయి. కొవ్వాడ కాల్వలో రాకపోకలు బంద్ చేశారు.జిల్లా వ్యాప్తంగా 14,329 హెక్టార్లలో వరి నాట్లు నీట మునిగాయి. 18 మండలాల పరిధిలోని 217 గ్రామాల్లో 16,845 మంది రైతులు ఆందోళన చెందుతున్నారు.

14,329 హెక్టార్లలో వర్రీయే

జిల్లాలో పంటలకు భారీ నష్టం జరిగింది. వరిచేలు నీటి ముంపులోనే ఉన్నాయి.ఉద్యాన పంటలదీ అదే పరిస్థితి. ఎర్రకాలువ, కొవ్వాడ కాలువ, బురద కాలువ,జల్లకాలువలు పొంగడంతో 14,329 హెక్టార్లలో వరినాట్లు ముంపులో ఉన్నా యి. దీంతో 18 మండలాల పరిధిలోని 217 గ్రామాలకు చెందిన 16,845 మంది రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎర్రకాలువ వల్ల నల్లజర్ల, నిడదవోలు మండలాల్లో సుమారు 10 వేల హెక్టార్లలో నష్టం వాటిల్లింది.ఈ మేరకు ఆయా మండలాల్లో కలెక్టర్ పి.ప్రశాంతి విస్తృతంగా పర్యటించారు. కంసాలిపాలెంలో పునరావాస కేంద్రం ఏర్పాటు చేశారు. వరద నీటిలో పాములు కొట్టుకురావడంతో కలెక్టర్ ఆదేశాల మేరకు అటవీ శాఖ అధికారులకు కంసాలిపాలెంలో పాములు పట్టించారు. కొవ్వాడ కాలువ వల్ల తాళ్లపూడి మండలంలో నష్టం జరిగింది. ఉద్యాన పంటలకు సంబంధించి 40 గ్రామాల్లో 431 మంది రైతులకు చెందిన 276.28 హెక్టార్ల పంట నీట మునిగిపోయింది.బురద కాలువ వల్ల గోకవరం, కోరుకొండ, సీతానగరం మండలాల్లో, జెల్ల కాలువ వల్ల రాజమహేం ద్రవరం రూరల్ మండలం బూరు గుపూడి,కొంతమూరు, కాతేరు పరిసర ప్రాంతాల్లో ఆవ భూములు సముద్రాన్ని తలపిస్తున్నాయి.



దారులన్నీ ఇంతే : ఛిద్రమైన బూరుగుపూడి రహదారి

విద్యుత్ శాఖకు తీవ్ర నష్టం..

భారీ వర్షాల వల్ల విద్యుత్ శాఖకు భారీ నష్టం వాటిల్లింది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 60 విద్యుత్ స్థంభాలు, 79 ఎల్‌టీ పోల్స్, 14 డిస్ట్రిబ్యూషన్ ట్రాన్సఫా ర్మర్లు దెబ్బతినడంతో రూ.36.48 లక్షలు నష్టం జరిగింది. నిడదవోలు డివిజన్‌లో 11 కేవీ పోల్స్ 19, ఎల్‌టీ పోల్స్ 5 దెబ్బతినడంతో రూ.4.26 లక్షల నష్టం జరిగింది. 138 వ్యవసాయ కనెక్షన్లకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.46 పునరుద్ధరించారు. నిడదవోలు డివి జన్‌లో 126 సర్వీసులకు విద్యుత్ నిలిచిపోయింది.



ముంచేసిన వరద : నిడదవోలు మండలం తాళ్లపాలెంలో నీట మునిగిన పంచాయతీ కార్యాలయం, పాఠశాల భవనం

రైతులు ఆందోళన చెందవద్దు : శాస్త్రవేత్తలు



తాళ్ళపూడి, జూలై 20 : వర్షం నీటిలో ఉన్న పొలాల్లో మాత్రం వరినాట్లను కాపాడుకునే అవకాశం ఉందని ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు తెలిపారు. కొవ్వాడ కాలువ పరీవాహక ప్రాంతాలైన తాళ్ళపూడి మండలంలోని అన్నదేవరపేట, పెద్దేవం, మలకపల్లి, తిరుగుడుమెట్ట గ్రామాల్లో ముంపు ప్రాంతాలను ఏరువాక కేంద్రం కో ఆర్డినేటర్ చల్లా శంకరరావు, మార్టేరు శాస్త్రవేత్త శ్రీనివాసరావు, జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు, ఏడీఏ చంద్రశేఖర్ పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. ఆందోళన చెందవద్దని సూచించారు.



వంతెనా పోయే.. రోడ్డూ పోయే : బొబ్బిల్లంక మిర్తిపాడు రహదారిలో కొట్టుకుపోయిన రోడ్డు.. వరద ప్రవాహం

వైసీపీ పాలకుల నిర్లక్ష్యం.. ముంచెత్తిన వరద

సీతానగరం,జూలై 20 : వైసీపీ నాయకుల నిర్లక్ష్యం కారణంగా వర్షాలకు రోడ్డు కొట్టుకుపోయింది. బొబ్బిల్లంక మిర్తిపాడు రహదారిలో తెలుగుదేశం హయాంలో వంతెన నిర్మించారు. అయితే వైసీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత తూరలు చిన్నవి పెట్టి వంతెన కట్టడం వల్ల పంట భూములు మునిగిపోతున్నాయన్న నెపంతో వంతెన కూలగొట్టి తాత్కాలిక రోడ్డు వేశారు. 2023లో వంతెన సరిచేయడానికి రూ.4.5 కోట్లు మంజూరు చేసినప్పటికి కాంట్రాక్టర్లు ముందుకు రాలేదు. ప్రస్తుతం వర్షాలకు నేల బారున ఉన్న తాత్కాలిక రోడ్డు మాత్రం వరదలకు కొట్టుకుపోయింది. దీంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. బొబ్బిల్లంక వైపు నుంచి మధురపూడి విమానాశ్రయానికి వెళ్లడానికి ఇదే మార్గం. ఇది గాక చుట్టుపక్కల పొలాలకు ఇదే దారి. ప్రస్తుతం రోడ్డు మునిగిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. కూటమి నాయకులు స్పందించి మళ్లీ వంతెన నిర్మాణం చేపట్టాలని రైతులు, ప్రజలు కోరుతున్నారు.

శాంతించిన వరుణదేవుడు..

రాజమహేంద్రవరం సిటీ, జూలై 20 : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి ప్రభావంతో గత మూడు రోజులుగా ఒక మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిశాయి. గత రెండు రోజులతో పోల్చితే శనివారం వర్షం తీవ్రత బాగా తగ్గింది. ఉదయం 8:30 నుంచి సాయంత్రం 4 గంటలోపు జిల్లాలో 109.6 మీమీ వర్షపాతం నమోదైంది. జిల్లాలో సీతానగరంలో 8.4 మి.మీ, రాజమహేంద్రవరంలో 8.2 మి.మీ, రాజమహేంద్రవరం రూరల్‌లో 7.4 మి.మీ, నిడదవోలులో 7.4 మి.మీ, పెరవలిలో 6.4 మి.మీ,తాళ్ళపూడిలో 6.0 మి.మీ, కడియంలో 6.0 మి.మీ, రాజానగరంలో 6.0 మి.మీ, గోకవరంలో 5.8 మి.మీ, చాగల్లులో 5.6 మి.మీ, కోరుకొండలో 5.4 మి.మీ, ఉండ్రాజవరంలో 5.4 మి.మీ, అనపర్తిలో 5.2 మి.మీ, నల్లజర్లలో 5.0 మి.మీ, రంగంపేటలో 5.0 మి.మీ, కొవ్వూరులో 4.6 మి.మీ, దేవరపల్లిలో 4.6 మి.మీ, గోపాలపురంలో 4.0 మి.మీ, బిక్కవోలులో 3.2 మి.మీ వర్షపాతం నమోదైంది. జిల్లా వ్యాప్తంగా సగటున 5.9 శాతం వర్షం మాత్రమే కురిసింది.

ఉప్పొంగుతున్న గోదారి



అఖండ గోదారి : కొవ్వూరు గోష్పాదక్షేత్రంలో ఉధృతి..

కొవ్వూరు, జూలై 20 : ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలతో అఖండ గోదావరి ఉప్పొం గుతుంది. నదీ పరీవాహక ప్రాంతాలలో కురుస్తున్న వర్షాలకు ఉపనదులు, కొండ వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి.పోలవరం ఎగువ కాఫర్‌డ్యామ్ వద్ద వరద పోటెత్తడంతో స్పిల్‌వే నుంచి సుమారు 4 లక్షల క్యూసెక్కుల వరద నీరు రాజమహేంద్ర వరం అఖండ గోదావరిలోకి వచ్చి చేరుతోంది. ధవళేశ్వరం బ్యారేజి వద్ద 175 గేట్లను ఎత్తివేసి శనివారం సాయంత్రం ఆరు గంటలకు 4,09,459 క్యూసె క్కుల వరద నీరు సముద్రంలోకి విడుదల చేశారు. బ్యారేజి వద్ద నీటిమట్టం 8.70 అడుగులకు చేరింది.భద్రాచలం వద్ద 35.20 అడుగులుగా ఉంది.ధవళేశ్వరం వద్ద సోమవారం నాటికి మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేసే అవకాశం ఉన్నట్టు అధికారుల అంచనా.కొవ్వూరులో గోష్పాదక్షేత్రంలో ప్రధాన స్నానఘట్టాలను ముంచెత్తుతూ అఖండ గోదావరి ఉప్పొంగి ప్రవహిస్తుంది. స్నానఘట్టాల్లో ఉన్న శివలింగం, నందీశ్వరుడు, కాశీ విశ్వేశ్వరుడు విగ్రహాలను వరద ముంచెత్తింది. గత వైసీపీ ప్రభుత్వంలో పోలవరం నుంచి సిద్ధాంతం వరకు గోదావరి ఏటిగట్లను కొల్లగొట్టి ఇసుక ర్యాంపులు ఏర్పా టు చేయడంతో తీరప్రాంత ప్రజలు ఏ సమయంలో ఏ ప్ర మాదం ముంచుకొస్తుందోనని భయాందోళన చెందుతున్నారు.

నష్టపోయిన రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ

మంత్రి కందుల దుర్గేష్



పెరవలి, జూలై 20 : నష్టపోయిన రైతులందరికి ఇన్‌ఫుట్ సబ్సిడీ రూ.6 వేలు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని మంత్రి కందుల దుర్గేష్ ఆదేశించారు.పెరవలిలో శనివారం ఆయన మాట్లాడారు. అధికారులు పంట నష్టాన్ని అంచనా వేసే సమయంలో నిబంధనలు సడలించి రైతులకు న్యాయం జరిగేలా చూడాలన్నారు. వరిపంట వేసిన నెల రోజుల్లోపు పంట పాడైతే కేవలం విత్తనం సబ్సిడీ వెయ్యి రూపాయలు మాత్రమే వస్తుందని, కానీ రైతులు ఇప్పటికే వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టి ఉన్నారన్నారు. భారీ వర్షాలతో వరి, ఉద్యా న పంటలు కూడ దెబ్బతిన్నాయన్నారు.

పారిశుధ్యంపై దృష్టి పెట్టండి : కలెక్టర్

నిడదవోలు, జూలై 20 : పునరావాస కేంద్రాల్లో ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలని..ముంపు ప్రాంతాల్లో శానిటేషన్‌పై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. నిడదవోలు మండలంలో వరద ముంపు ప్రాంతాలైన రావిమెట్ల, శింగవరం,తీరుగూడెం తదితర ప్రాంతాల్లో శనివారం పర్య టించారు.పునరావాస కేంద్రాల్లో బస ఏర్పాట్లు, శానిటేషన్, వైద్య శిబిరం అందుబాటులో ఉండాలన్నారు.ఆదేశాలు ఇచ్చే వరకు మత్స్యకారులు చేపల వేటకు వెళ్లవద్దన్నారు.ప్రభుత్వాసుపత్రుల్లో స్నేక్‌బైట్, యాంటి వైరల్ మందులు,ఇంజక్షన్లు అందుబాటులో ఉంచుకోవాలన్నారు.బసివిరెడ్డిపేటలోని ఆటోమెటిక్ వాతావరణ కేంద్ర పరికరాన్ని పరిశీలించారు.ఆమె వెంట సబ్ కలెక్టర్ అశుతోష్‌శ్రీవాత్సవ,డీఎంహెచ్‌వో వెంకటేశ్వరరావు,డీసీహెచ్ఎస్ పద్మశ్రీ,ఎంపీడీవో ఝాన్సీ, తహశీల్దార్ వి.నాగభూషణం ఉన్నారు.



నాడు.. నేడూ ఇంతేనా : శ్రీరంగపట్నంలో నీట మునిగిన పాఠశాల ఆవరణ

సెలవు రోజునా..టీచర్లు బడికి..

కోరుకొండ, జూలై 20 : జిల్లాలో భారీ వర్షాలకు శనివారం జిల్లాలో పాఠశాలలకు కలెక్టర్ ఆదే శాల మేరకు సెలవు ప్రకటించారు.అయితే పాఠశాలలకు సెలవు ఇచ్చినప్పటికీ ఉపాధ్యాయులు యధావిధిగా పాఠశాలలకు సకాలంలో వెళ్లాలని శనివారం ఉదయం హెచ్‌ఎంలకు మెసేజ్ రావడంతో ఉరుకులు పరుగులు తీశారు. పాఠశాలలకు విద్యార్థులు రాకపోయినా ఉపాధ్యాయులు ఉదయం నుంచి సాయంత్రం వరకు పాఠశాలలోనే గడిపారు. గతంలో ఎప్పుడు ప్రభుత్వం సెలవు ప్రకటించినా పాఠశాలలకు కేవ లం ఉపాధ్యాయులు మాత్రమే హాజరైన సందర్భాలు లేవు.

ఆర్టీసీ ఆదాయానికి గండి

రాజమహేంద్రవరం అర్బన్, జూలై 20 : ఎడతెరిపిలేని వర్షాలు ఆర్టీసీ ఆదాయానికి భారీగానే గండి కొడుతున్నాయి. గత నాలుగు రోజులుగా వర్షాలు వదలకపోవడంతో జిల్లావ్యాప్తంగా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించేవారి సంఖ్య గణనీయంగా పడిపోయింది. ఈ ప్రభావం ఆర్టీసీ రోజువారీ ఆదాయంపై పడుతోంది. సాధారణ రోజుల్లో సగటున జిల్లా ఆర్టీసీకి నాలుగు డిపోల నుంచి (రాజమహేంద్రవరం, గోకవరం, కొవ్వూరు, నిడదవోలు) రోజుకు రూ.34 లక్షల నుంచి రూ.36 లక్షల వరకూ ఆదాయం వచ్చేది. వర్షాలు వదలకపోవడంతో ఆదాయం రోజుకు రూ.28 లక్షల నుంచి రూ.30 లక్షలకు పడిపోయిందని ఆర్టీసీ వర్గాలు చెబుతున్నాయి. జిల్లాలోని నాలుగు డిపోల నుంచి అన్ని బస్సు సర్వీసులు యథావిధిగా నడుస్తున్నాయని, భద్రాచలం రూటుతో సహా ఏ ఒక్క సర్వీసు రద్దు కాలేదని ఆర్టీసీ అధికారులు వెల్లడించారు.

గోదావరిలో యువకుడు గల్లంతు



కొవ్వూరు, జూలై 20 : నాలుగు రోజుల్లో ఉన్నత చదువుల నిమిత్తం ఆస్ట్రేలియాకు వెళ్లవలసిన ఆ యువకుడు గోదావరిలో గల్లంతయ్యాడు. పోలీసులు అందించిన వివరాల ప్రకారం. నల్లజర్ల మండలం ఆవపాడు గ్రామానికి చెందిన పసుపులేటి శ్రీను, తాయారు దంపతులకు ఇద్దరు కుమారులు.పెద్దకుమారుడు వంశీకృష్ణ(25) ఎంబీఏ పూర్తిచేశాడు.వారం రోజుల్లో ఉన్నత చదువుల నిమిత్తం ఆస్ట్రేలియా పంపడానికి అన్ని ఏర్పాట్లు చేశారు. రాజమహేంద్రవరంలో స్నేహితులను కలిసి వస్తానని చెప్పి బైక్‌పై ఈ నెల 19వ తేదీన శుక్రవారం ఇంటి నుంచి బయటకు వచ్చాడు.ఇంటికి తిరిగి వెళ్లకపోవడంతో కుటుంబ సభ్యులు కంగారు పడుతున్నారు. కొవ్వూరు ఏరినమ్మఘాట్ ఇసుకర్యాంపులో శనివారం ఉదయం కాలకృత్యాలు తీర్చుకోవడానికి వెళ్లి ప్రమాదవశాత్తు కాలుజారి నదిలో ము నిగి గల్లంతయ్యాడు. స్థానికులు గమనించి బైక్‌లో ఉన్న సెల్‌ఫోన్ ఆధారంగా ఇంటికి సమాచారం అందించారు. కుటుంబీకులు సంఘటనా స్థలానికి చేరుకుని గోదావరిలో వంశీకృష్ణ కోసం పడవలపై గాలింపు చర్యలు చేపట్టినా గోదావరి ఉధృతంగా ఉండడంతో ఫలితం లేకపోయింది. మృతుడి సోదరుడు పసలపూడి మురళీకృష్ణ ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసినట్లు కొవ్వూరు పట్టణ హెడ్ కానిస్టేబుల్ రాజమహేంద్రవరపు సత్యనారాయణ తెలిపారు.

జాయింట్ కలెక్టర్‌గా హిమాన్షు కౌశిక్

కడప మునిసిపల్ కమిషనర్‌గా తేజ్‌భరత్



రాజమహేంద్రవరం సిటీ, జూలై 20 : తూర్పుగోదావరి జిల్లా జాయింట్ కలెక్టర్‌గా హిమాన్ష్ కౌశిక్ నియమితులయ్యారు.ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం జీవో నెం 1288 ద్వారా శనివారం ఉత్తర్వులు విడుదల చేసింది. 2018 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన హిమాన్ష్ కౌసిక్ ఢిల్లీ ఆంధ్రాభవన్ అడిషనల్ రెసిడెంట్ కమిషనర్‌గా పనిచేస్తున్నారు. ఆయన్ను తూర్పుగోదావరి జిల్లా జాయింట్ కలెక్టర్‌గా బదిలీ చేశారు. ఇప్పటి వరకు తూర్పుగోదావరి జిల్లా జాయింట్ కలెక్టర్‌గా పనిచేసిన ఎస్.తేజ్ భరత్‌ను కడప నగరపాలక సంస్థ కమిషనర్‌గా నియమిస్తూ ఉత్తర్వులు విడులయ్యాయి.

రాజమహేంద్రవరం కమిషనర్‌గా కేతన్ గర్గే

గుంటూరుకు దినేష్‌కుమార్ బదిలీ



రాజమహేంద్రవరం సిటీ, జూలై 20 : రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ కమిషనర్‌గా కేతన్ గర్గే నియమితులయ్యారు. రాష్ట్ర వ్యాప్తంగా జేసీ లు, కమిషనర్లను బదిలీలు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది.ఇప్పటివరకు కేతన్ గర్గే అనంతపురం జిల్లా జాయింట్ కలెక్టర్‌గా పనిచేశారు.ప్రస్తుతం రాజమహేంద్రవరం కమిషనర్‌గా నియమితులయ్యారు. ఇప్పటి వరకూ రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ కమిషనర్‌గా ఉన్న దినేష్ కుమార్ గుంటూరుకు బదిలీ అయ్యారు. 2017 బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ అధికారి దినేష్ కుమార్ రాజమహేంద్రవరం కమిషనర్‌గా 2022 ఏప్రిల్ 8న బాధ్యతలు స్వీకరించారు. 15 నెలల పాటు పనిచేశారు.

పంచాయతీ కార్యదర్శులకు పదోన్నతులు

కార్పొరేషన్ (కాకినాడ), జూలై 20: ఎప్పటి నుంచో ఎదురుచూస్తున్న గ్రేడ్ 3 పంచాయతీ కార్యదర్శుల పదోన్నతులు జరిగాయి. పంచాయతీ రాజ్ కమిషనర్ కె.కన్నబాబు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. జోన్ 2లోని ఉమ్మడి పశ్చిమగోదావరి,ఉమ్మడి తూర్పుగోదావరి, ఉమ్మడి కృ ష్ణా జిల్లాలకు సంబంధించి గ్రేడ్3 కార్యదర్శులు 268 మంది, జూనియర్ అసిసెంట్లు 96 మంది,శానిటరీ ఇన్‌స్పెక్టర్లు ముగ్గురు,జిల్లా పంచాయతీ, డివిజనల్ పంచాయతీ కార్యాలయాల్లో పనిచేసే జూనియర్ అసిసెంట్లు, టైపిస్టులు 32 మందికి గ్రేడ్2 కార్యదర్శులుగా పదోన్నతులు కల్పించారు.

ఓటు పడింది..

- ప్రశాంతంగా అర్బన్ బ్యాంక్ పోలింగ్
- ఆర్యాపురం బ్యాంక్ ఓటర్లు 74,585
- ఓటేసింది 18,933.. 25.31 శాతమే
- నాలుగో వంతు మాత్రమే ఓటర్లు రాక
- కుట్రపూరితంగా వ్యవహరించిన వైసీపీ
- నేడు కౌంటింగ్‌కు ఏర్పాట్లు పూర్తి

రాజమహేంద్రవరం,జూలై 20 (ఆంధ్రజ్యోతి) : ప్రతిష్ఠాత్మకమైన ఆర్యాపురం కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ పోలింగ్‌పై ఓటరు పెద్దగా ఆసక్తి చూపలేదు. వర్షం ప్రభావమో ఏమో తెలియదు కానీ కేవలం 25.31 శాతం ఓట్లు మాత్రమే పోలయ్యాయి.మొత్తం 16 బ్రాంచిల పరిధిలో 74,585 ఓటర్లు ఉండగా కేవలం 18,876 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. 2014లో జరిగిన ఎన్నికల్లో కూడా కేవలం 18,933 మంది మాత్రమే ఓటు హక్కు వినియోగించుకోవడం గమనార్హం. రూ.వెయ్యి కోట్లకు పైగా టర్నోవర్ ఉన్న బ్యాంక్‌లో 4వ వంతు ఓట్లతోనే పాలకవర్గాలు ఏర్పడ డం అంటే పరిస్థితేంటో అర్థం చేసుకోవచ్చు. రాజమ హేంద్రవరం ఎస్‌కేవీటీ ఇంగ్లీష్ మీడియం స్కూల్, డిగ్రీ కళాశాలలు ఓటర్లతో కిక్కిరిశాయి. ఒక్కొక్కరు పదేసి ఓట్లు వేయవలసి ఉండడం వల్ల ఆలస్యమైంది. ఉదయం 9 గంటలకు కేవలం 725 మంది ఓటు హక్కు వినియోగించుకోగా 10గంటలకు 2,354 మంది, 12 గంటలకు 7,537 మంది, 2గంటలకు 12,701 మంది, 4గంటలకు 18,876 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. 12 గంటల నుంచే పుంజుకుంది. చివరి రెండు గంటల్లో 6 వేల మందిపైగా ఓటేశారు. తెలుగుదేశం, జనసేన బీజేపీ కూటమి చైర్మన్ అభ్యర్థి చల్లా శంకర రావు ప్యానల్‌లో 11 మంది, వైసీపీ నేత నందెపు శ్రీనివాస్ చైర్మన్ అభ్యర్థిగా ఉన్న ప్యానల్ నుంచి 11 మంది పోటీ చేసిన సంగతి తెలిసిందే. మొత్తం 12 డైరెక్టర్ పదవుల్లో ఒకటి ఏకగ్రీవం కాగా 11 డైరెక్టరు పదవులకు పోలింగ్ జరిగింది. మొత్తం 34 మంది అభ్యర్థులు పోటీ పడ్డారు. ఉదయం నుంచి కూటమి ప్యానల్ చైర్మన్ అభ్యర్థి చల్లా శంకరరావు,జనసేన, బీజేపీ నేతలు ఓటర్లకు స్లిప్‌లు పంపిణీ చేసి జాగ్రత్తగా ఓటు వినియో గించుకునే ప్రయత్నం చేశారు. మరో పక్క వైసీపీ నేతలు మోసపూరితంగా వ్యవహరించడం గమనార్హం. వాళ్ల ప్యానల్ నెంబర్లు ఉన్న స్లిప్ మీద చల్లా శంకర రావు ప్యానల్ అని ముద్రించి ఓటర్లకు పంపిణీ చేయడం వివాదాస్పదమైంది.కూటమి ప్యానల్ గెలుస్తుందనే భయంతో వైసీపీ కుట్రపూరితంగా వ్యవహరించిందని జనసేన సిటీ నియోజకవర్గ ఇన్‌చార్జి అనుశ్రీ సత్యనారాయణ ఆరోపించారు.కానీ చల్లా ప్యానలే విజయం సాధిస్తుందన్నారు. ఒక బూత్‌లో వైసీపీ యువనేత గణేష్ రావడంతో రెండు వర్గాల మధ్య వాగ్వాదం జరిగింది.పోలీసులు ఇరువర్గాలను చెదరగొట్టడం గమనార్హం. పోలింగ్ స్టేషన్ల వద్ద బందోబస్తును ఎస్పీ డి.నరసింహ కిశోర్ పరిశీలించారు. అడిషనల్ ఎస్పి ఎస్ఆర్.రాజశేఖరరాజు, డీఎస్పీలు విజయపాల్, ఎం.అంబికా ప్రసాద్ పరిస్థితిని పర్యవేక్షించారు.



ఎస్‌కేవీటీ స్కూల్‌లో ఓటేస్తున్న యువతి

నేడు కౌంటింగ్

ఓట్ల లెక్కింపు ఆదివారం ఉదయం 8గంటల నుంచి ఉంటుందని ఎన్నికల అధికారి వి.కృష్ణకాంత్ తెలిపారు. దీనికి అవసరమైన ఏర్పాట్లను ఎస్‌కెవిటీ డిగ్రీ కళాశాలలో చేసినట్టు చెప్పారు. రెండు కౌంటింగ్ హాళ్ల ఏర్పాటు చేశారు.ఒక్కో హాల్‌లో 13 టేబుళ్ల ఉంటాయని తెలిపారు.పోలీస్ బందోబస్తు మధ్య బ్యాలెట్ బాక్స్ లను ఎస్‌కేవీటీ డిగ్రీకళాశాల స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరిచారు.





ఎస్‌కేవీటీ స్కూల్లో ఓటర్ల క్యూ.. కేంద్రం వద్ద చైర్మన్ అభ్యర్థి చల్లా

సొంత జిల్లాలకు తహశీల్దార్లు

రాజమహేంద్రవరం జూలై 20(ఆంధ్రజ్యోతి) : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లా నుంచి ఇతర జిల్లాలకు బదిలీ అయిన తహశీల్దార్లను తిరిగి సొంత జిల్లాకు పంపిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. వీరు వెంటనే విధుల్లో చేరవలసి ఉంది. ఎన్నికల సమయంలో జిల్లాకు వచ్చిన తహశీల్దార్లను రిలీవ్ చేయలేదు. ఇప్పుడు రిలీవ్ చేసి తహశీల్దార్లకు కొత్త పోస్టింగ్‌లు ఇవ్వనున్నారు. ఇప్పటికే పలువురు తహశీల్దార్లు ఎమ్మెల్యేల సిఫారసు లేఖలను తీసుకున్నట్టు సమాచారం.



పొగాకు కేజీ రూ.400

రికార్డు స్థాయి ధర.. రైతుల ఆనందం

గోపాలపురం/ దేవరపల్లి, జూలై 20: పొగాకు పంట ఆరంభం నుంచి ఇప్పటి వరకూ ఎన్నడూ లేనంత రికార్డు స్థాయి ధర శనివారం పలికింది. దీంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.గోపాలపురం పొగాకు బోర్డులో శనివారం నిర్వహించిన కొనుగోళ్లలో గరిష్ఠ ధర రూ.400కి చేరింది. కనిష్ఠ ధర రూ.235.గోపాలపురం పొగాకు బోర్డులో శనివారం 592 బేళ్ళు కొనుగోళ్లకు సిద్ధం చేయగా 81 బేళ్ళను తిరస్క రించా రు. వేలం ప్రక్రియలో 37 కంపెనీలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నట్టు వేలం నిర్వహణాధికారి తెలిపారు.దేవరపల్లి కేంద్రంలో కనిష్ఠ ధర రూ. 242తో ఆరంభమై గరిష్ఠ ధర రూ.399కి చేరింది.కావడంతో రైతులు ఆనందానికి అవధులు లేకుండా పోయాయి.అంతర్జాతీయ మార్కెట్‌లో చైనా, బ్రెజిల్, జింబాబ్వే, ఇండోనేషియా దేశాల్లో పొగాకు ఉత్పత్తి తగ్గడంతో మన పొగాకుకు డిమాండ్ ఏర్పడింది.

తూర్పుగోదావరి
• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి • కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం

ఆంధ్రజ్యోతి www.andhrajyothy.com



బ్యారేజ్ వద్ద పరవళ్ళు తొక్కుతూ ప్రవహిస్తున్న వరద నీరు

వీడని ముసురు

- ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వాన
- స్తంభించిన జనజీవనం
- వ్యాపార సంస్థలు వెలవెల
- వేలాది ఎకరాల్లో పంట మునక
- వర్షాలతో రైతుల్లో ఊరట.. భయాందోళన

కొవ్వూరు, జూలై 20: తుఫాను ప్రభావంతో మూడు రోజులుగా ముసురు వీడలేదు. గురువారం తెల్లవారుజామున ప్రారంభమయిన వర్షం ఎడతెరిపి లేకుండా ఏకధాటిగా కురుస్తూనే ఉంది. శనివారం తెల్లవారుజాము నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. మరోవైపు వాతావరణ శాఖాధికారులు మరో మూడు రోజులపాటు వర్షాలు కురుస్తాయని ఇప్పటికే హెచ్చరికలు జారీ చేశారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా జన జీవనం స్తంభించి వ్యాపార సంస్థలు వెలవెల బోతున్నాయి. లోతట్టు ప్రాంతాలతో పాటు, రహదారి గోతుల్లో వర్షపునీరు నిలిచి ప్రజలు, వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. వర్షాకాలం వచ్చి రెండునెలలు కావస్తున్నా ఇప్పటివరకు సరైన వర్షాలు కురవక నిరుత్సాహం చెందిన రైతులకు మూడురోజులుగా కురుస్తున్న వర్షాలతో ఊరట కలిగించడంతో పాటు ఆందోళన చెందుతున్నారు. వర్షాలతో వ్యవసాయ పనులు ఊపందుకున్నాయి. వర్షాలు సాగుకు అవసరమైనప్పటికీ డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో వర్షపునీరు ఎగదన్ని పంటపొలాల్లో నిలిచి పంట మొత్తం మునిగి నష్టం వాటిల్లుతుందని వాతున్నారు. రహదారి గుంతలలో వర్షపునీరు రోడ్లపై ప్రవహించడంతో ద్విచక్ర వాహనదారులు గోతుల్లో పడి ప్రమాదాల బారిన పడుతున్నారు. కాలువలో గుర్రపుడెక్క పెరిగిపోవడం, అడ్డుకట్టలు వేయడంతో నీరు ముందుకు పారక వేలాది ఎకరాల్లో పంట పొలాలు ముంపుకు గురయ్యాయి.

తాళ్లపూడి: మండలంలోని అన్నదేవరపేటలోని జాన్‌పేటలోకి కొవ్వాడ వరదనీరు చేరింది. అంగన్‌వాడీ స్కూల్ చుట్టూ నీరు చేరింది. విషయాన్ని కొడమంచిలి జాన్‌బాబు.. టీడీపీ నాయకుడు అల్లూరి విక్రమాదిత్య దృష్టికి తీసుకురాగా ఆ ప్రాంతాన్ని సందర్శించి పంచాయతీ అధికారులతో మాట్లాడి ప్రొక్లెయినర్ ద్వారా కొవ్వాడ నీరు పోయే మార్గాన్ని సుగమం చేయించారు. కార్యక్రమంలో కూచిపూడి లక్ష్మణరావు, సత్యేంద్ర, గణపతి, భరత్, బొచ్చు శ్రీను, ముప్పిడి రాజేష్, యోహాను, కౌలూరి యేసు పాల్గొన్నారు. గ్రామంలో కొవ్వాడ కాలువ ఉధృతికి గ్రామం నుంచి అవతలి గట్టుకు రాకపోకలు లేకుండా అధికారులు బారికేడ్లు ఏర్పాటు చేశారు. ఉధృతంగా ప్రహిస్తున్న కాలువ వద్దకు ప్రజలెవ్వరూ వెళ్లవద్దని హెచ్చరికలు జారీ చేశారు. కార్యక్రమంలో తహశీల్దార్ సీహెచ్ శ్రీనివాస్, ఎంపీడీవో వెంకటరమణ, ఈవోపీఆర్డీ వీరన్న పాల్గొన్నారు.

ఉండ్రాజవరం: ఎడతెరిపి లేని వర్షానికి వరి చేలు చెరువుల్లా ఉన్నాయి. నీరు వెళ్లే దారి లేకపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని సూర్యారావుపాలెం, కాల్ధరి, పసలపూడి గ్రామాలకు చెందిన కొద్దిపాటి వరి చేలు ఎర్రకాలువను ఆనుకుని ఉండడంతో వరద ఉధృతికి యనమదుర్రు డ్రైన్ ఎడమ గట్టు పైనుంచి కాల్ధరి పరిధిలో పొంగి పంటపొలాలను ముంచెత్తుతోంది. ఇప్పటికే రైతులు ఏర్పాటు చేసుకున్న మురుగునీటి తూరల ద్వారా సూర్యారావుపాలెం, పసలపూడి, గ్రామాల్లోని పంటపొలాలు నీట మునిగాయి. సూర్యారావుపాలెం నుంచి పసలపూడి మీదుగా కాల్ధరి వచ్చే రోడ్డుపై నీరు వచ్చి చేలల్లో పడుతోంది. రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. వరిచేలు చెరువులా మారడంతో ఎప్పటికి నీరు తీస్తాయోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మూడు గ్రామాల్లో సుమారు 2500 ఎకరాలు నీట మునిగినట్టు రైతులు పేర్కొంటున్నారు. అధికారులు నీట మునిగిన పొలాలను పరిశీలిస్తున్నారు.

నిడదవోలు: మండలంలోని తాళ్లపాలెం గ్రామం ఎర్రకాలువ వరద నీటితో జలమయమైంది. పంచాయతీ కార్యాలయం, పాఠశాల, గ్రామంలోని ప్రధాన రోడ్లన్నిటినీ ఎర్రకాలువ ముంచేసింది. గ్రామస్థులు ఊరు వదిలి బయటకు రాలేని పరిస్థితి నెలకొంది. మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు గ్రామంలో పర్యటించి ప్రభుత్వ పరంగా గ్రామస్థులకు ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని పరిశీలించారు. అలాగే స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఆర్.కృష్ణనాయక్ కంసాలిపాలెంలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రంలో భోజన ఏర్పాట్లను పరిశీలించారు. వరద ముంపు గ్రామాల్లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాల్లో బస, భోజన సదుపాయాలు కల్పించామని, శుచి, శుభ్రతతో కూడిన వేడి ఆహారాన్ని అందిస్తున్నట్టు చెప్పారు.

దేవరపల్లి: ఇటీవల కురిసిన వర్షాలకు మండలంలోని రామన్నపాలెంలో లోతట్టు ప్రాంతంలోని ఇళ్లలోకి నీరు చేరింది. మూడురోజులుగా నీరు అలాగే ఉండడంతో ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్థులు వాపోయారు. నీరు కిందికి పారే విధంగా పంచాయతీ అధికారులు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. టీడీపీ నాయకుడు పరిమి శ్రీరామకృష్ణ మాట్లాడుతూ వర్షాలకు దళితపేటలో ఇళ్లు ముంపునకు గురయ్యాయని అధికారులెవరూ పట్టించుకున్న దాఖలాలు లేవన్నారు.



తాళ్లపూడి: అన్నదేవరపేట జాన్‌పేట కాలనీలో చేరిన కొవ్వాడ వరద నీరు



ఉండ్రాజవరం: యనమదుర్రు డ్రైన్ గట్టు నుంచి కాల్ధరి వద్ద చేలల్లోకి వస్తున్న వరదనీరు



దేవరపల్లి: రామన్నపాలెంలో ఇళ్లలోకి చేరిన వర్షం నీరు

గోదావరి పరవళ్లు

4.09 లక్షల క్యూసెక్కులు సముద్రంలోకి విడుదల

ధవళేశ్వరం, జూలై 20: ఎగువ ప్రాంతాల్లో విస్తారంగా కురుస్తున్న వర్షాల వల్ల ఉపనదులతో పాటు వాగులు, వంకలు ఉప్పొంగి గోదావరిలో కలుస్తుండడంతో సీజన్‌లో మొదటిసారిగా గోదావరి వరద నీటితో పరవళ్లు తొక్కుతోంది. ఎగువ నుంచి వస్తున్న వరదనీటితో ధవళేశ్వరం వద్ద నీటి మట్టం పెరుగుతోంది. దీంతో శనివారం సాయంత్రానికి కాటన్ బ్యారేజ్ ధవళేశ్వరం, విజ్జేశ్వరం ఆర్మ్‌లలోని మొత్తం గేట్లను 1.5మీటర్లు, ర్యాలీ, మద్దూరు ఆర్మ్‌లోని మొత్తం గేట్లను 2మీటర్ల మేర పైకి ఎత్తి 4,09,459 క్యూసెక్కులను సముద్రంలోకి విడుదల చేస్తున్నారు. ధవళేశ్వరం వద్ద నీటి మట్టం 8.70అడుగులుగా నమోదయింది. ఎగువన ఉపనది ఇంద్రావతి, దిగువన శబరి నుంచి వరదనీరు గోదావరికి చేరుతుండడంతో ధవళేశ్వరం వద్ద సోమవారం నాటికి వరద ప్రవాహం మరింత పెరిగి 9లక్షల క్యూసెక్కులకు పైగా వరద నీరు రావచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. కాగా ఎగువన భద్రాచలం వద్ద క్రమంగా పెరుగుతున్న నీటి మట్టం శనివారం సాయంత్రానికి 35.20అడుగులకు చేరుకుంది. నీటిమట్టం మరింత పెరగవచ్చని అంచనా.

సమస్యల పరిష్కారానికి ప్రత్యేక ప్రణాళిక

టీడీపీ నాయకులతో సమీక్షలో ఎమ్మెల్యే మద్దిపాటి



గ్రామాల్లోని సమస్యలను తెలుసుకుని నమోదు చేసుకుంటున్న ఎమ్మెల్యే మద్దిపాటి

దేవరపల్లి, జూలై 20: గ్రామాల్లోని సమస్యలు పరిష్కరించేందుకు టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షులు, నాయకులతో ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు సమీక్షా సమావేశం శనివారం నిర్వహించారు. గ్రామాల్లోని ప్రధాన సమస్యలను మండలంలోని 15 గ్రామాల్లోని సమస్యలను అడిగి నమోదు చేసుకున్నానని, వాటిని అసెంబ్లీ దృష్టికి తీసుకెళతానన్నారు. ప్రధానంగా సీసీ రోడ్లు, పొలాల లింకు రోడ్లు, పుంతల లింకురోడ్లు, వాటర్‌ట్యాంకులు, డ్రైనేజీలు, పంట కాలువలపై సమస్యలు ఎక్కువగా తీసుకొచ్చారని వాటి పరిష్కారానికి ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు ఆండ్రూ అనీల్, చినబాబు, సుంకర దుర్గారావు, మురళీ అజిత్‌కుమార్, ధృవకాంత్, భీమరాజు, శ్రీనివాస్, బొల్లిన భాస్కర్, గద్దే సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

23 నుంచి ఆధార్ నమోదు ప్రత్యేక శిబిరాలు

కొవ్వూరు, జూలై 20: ఆధార్ నమోదుకు ఈ నెల 23 నుంచి 27వరకు ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నట్టు కొవ్వూరు మున్సిపల్ కమిషనర్ కె.దానియేలు జోసఫ్ తెలిపారు. ఈ శిబిరాల్లో ఆధార్‌కార్డుల నవీకరణ, ఐదేళ్లలోపు పిల్లలకు ఆధార్ నమోదు చేస్తారన్నారు. 23న కొవ్వూరు 1వ వార్డు శ్రీరామకాలనీ సచివాలయం 1, 24న ప్రభుత్వ జూనియర్ కళాశాల, 25న మద్దిపట్ల వారి వీధి సచివాలయం 3, 26న మున్సిపల్ హైస్కూల్, 27న ఇందిరమ్మకాలనీ సచివాలయం 9లో ఆధార్ నమోదు శిబిరాలు ఏర్పాటు చేసినట్టు తెలిపారు.

గోదావరి మాతకు మహానీరాజనం



గోదావరి మాతకు హారతిస్తున్న భక్తులు

కొవ్వూరు, జూలై 20: కొవ్వూరు గోష్పాదక్షేత్రంలో అఖండ గోదావరిమాతకు మహా నీరాజనం అందజేశారు. గోదావరి నీరాజన సమితి అధ్యక్షుడు కలిగొట్ల కృష్ణారావు ఆధ్వర్యంలో శనివారం ప్రదోషకాలంలో ప్రధాన స్నానఘట్టంలోని గోదావరి మాతకు అష్టోత్తర శత కుంకుమార్చనలు నిర్వహించారు. అనంతరం గోదావరి మాతకు మహా నీరాజనం, దీపోత్సవం అందించారు. కార్యక్రమంలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

దళితుల హత్యలపై శ్వేతపత్రం విడుదల చేయాలి

కొవ్వూరు, జూలై 20: వైసీపీ పాలనలో జరిగిన దళితుల హత్యలపై కూటమి ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు బొంతా శ్యాం రవిప్రకాష్ డిమాండ్ చేశారు. ఈ నెల 22 నుంచి జరిగే రాష్ట్ర శాసనసభ సమావేశాల్లో రాష్ట్రంలో వైఎస్ జగన్ పాలనలో దళితులపై జరిగిన దాడులు, హత్యలు, ఆత్మహత్యలపై శ్వేతపత్రాలు విడుదల చేయాలన్నారు. డాక్టర్ సుధాకర్, ఎమ్మెల్సీ అనంతబాబు డ్రైవర్ సుబ్రహ్మణ్యం, కోడి కత్తి శ్రీను బెయిల్ విషయంలో జరిగిన అన్యాయం, గుంటూరులో రమ్య హత్య వంటి వాటిపై శ్వేతపత్రం విడుదల చేసి, అసెంబ్లీలో చర్చించాలని డిమాండ్ చేశారు.

ఎలక్ట్రీషియన్ కుటుంబానికి ఆర్థిక సహాయం

తాళ్లపూడి, జూలై 20: మండలంలోని వేగేశ్వరపురంలోని ఎనుమాల నరసింహరాజు అనే ఎలక్ట్రీషియన్ కొద్దిరోజుల క్రితం గుండెపోటుతో మృతిచెందాడు. ఆ కుటుంబానికి ఎలక్ట్రీషియన్ అసోసియేషన్ తరుపున రూ.10 వేలు అందించామని యూనియన్ కార్యదర్శి గుమ్మడి చంద్రశేఖర్ తెలిపారు. కార్యక్రమంలో ఎలుబోటు వీరరాఘవేంద్రరావు, ఎలుబోలు శ్రీనివాస్, బట్టు నాగరాజు, శీలబోయిన శ్రీనివాస్, కొండ్రు రమణ, సత్తిబాబు, రాంబాబు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికులను ఆదుకోవాలి

కొవ్వూరు, జూలై 20: తుపాను కారణంగా ఉపాధి కోల్పోయిన ఇసుక, భవన నిర్మాణ కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలని పౌరహక్కుల సంఘం నాయకుడు నంబూరి శ్రీమన్నారాయణ డిమాండ్ చేశారు. శనివారం గోదావరి నది ఒడ్డున నివసిస్తున్న పశ్చిమ బెంగాల్ ఇసుక కార్మికులకు బియ్యం బస్తా అందజేశారు. శ్రీమన్నారాయన మాట్లాడుతూ ఉచిత ఇసుక విధానం వల్ల ప్రత్యక్షంగా కార్మికులు, వినియోగదారులు లబ్ధి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. దళారీ వ్యవస్థను నిర్మూలించాలన్నారు.

వాసవి మాతకు 51 రకాల సారె



51 రకాల సారెతో మహిళలు

దేవరపల్లి, జూలై 20: ఆర్యవైశ్య మహిళా సంఘం ఆధ్వర్యంలో ఆషాడ మాసం సందర్భంగా శనివారం స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో ఉన్న వాసవిమాత అమ్మవారికి ఆర్యవైశ్య మహిళా సంఘం ఆధ్వర్యంలో 51రకాల స్వీట్ల సారే అమ్మవారికి సమర్పించారు. ఆర్యవైశ్య మహిళా సంఘం తీగల మంజూ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు.

1676 ఎకరాల్లో పంటనష్టం



చాగల్లు వరి చేలలో మోకాలు లోతు నీళ్లలో నిలబడి పంట నష్టం తెలియజేస్తున్న కౌలు రైతులు

చాగల్లు, జూలై 20: నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని 1676 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్టు తహశీల్దార్ సావిత్రి తెలిపారు. రెవెన్యూ సిబ్బంది సేకరించిన వివరాలు ప్రకారం వరి 1650 ఎకరాలు, అరటి 25 ఎకరాల్లో నష్టం జరిగినట్టు తెలిపారు. కలవలపల్లిలో ఒక ఇల్లు పాక్షికంగా ధ్వంసమైనట్టు ఆమె చెప్పారు.

డీఈవో.. గోనగూడెం పాఠశాల పరిశీలన



కోరుకొండ, జూలై 20: మండలంలోని పశ్చిమగోనగూడెం మోడల్ ప్రాథమిక పాఠశాలను శనివారం జిల్లా విద్యాశాఖాధికారి కె.వాసుదేవరావు శనివారం సందర్శించారు. పాఠశాలలో మధ్యాహ్న భోజన నిర్వహణ, ఇతర రికార్డులను పరిశీలించారు. ప్రధానోపాధ్యాయుడు ఎస్‌వీఎస్ ప్రసాద్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. అనంతరం ఆయన గుమ్మళ్లదొడ్డి పాఠశాల పరిశీలనకు వెళ్లారు. ఇదిలా ఉండగా కాపవరం పాఠశాలను ఎంఈవో సుజాత సందర్శించి రికార్డులు పరిశీలించారు.

సర్పంచ్‌లు, ఎంపీటీసీలకు ప్రాధాన్యమివ్వాలి

- అంటు వ్యాధుల వ్యాప్తిపై వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి
- పెరవలి మండల పరిషత్ సమావేశంలో మంత్రి దుర్గేష్



పెరవలి మండల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి దుర్గేష్

పెరవలి, జూలై 20: గ్రామాల్లో సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు ప్రజలతో ఎన్నుకోబడ్డారని, పార్టీరహితంగా అధికారులు వారికి తగిన విధంగా గుర్తింపు నిచ్చి అభివృద్ధి కార్యక్రమాల్లో భాగస్వాములను చేయాలని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్ అధ్యక్షతన శనివారం జరిగిన మండల పరిషత్ పరిషత్ సమావేశానికి ఆయన విచ్చేసి మాట్లాడారు. ప్రస్తుతం అంటు వ్యాధులు వ్యాప్తి చెందే ప్రమాదముందని, వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా అవసరాన్ని బట్టి పునరావాస కేంద్రాలను కూడా సిద్ధం చేసుకోవాలని సూచించారు. నియోజకవర్గానికి రూ.12 కోట్లు ఎన్‌ఆర్‌జీఎస్ నిధులు వచ్చాయని, వాటిలో పెరవలి మండలానికి రూ.4 కోట్లు కేటాయించినట్టు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు సభ్యులు మాట్లాడుతూ తమ గ్రామాల్లో మురుగునీటి సమస్య ఎక్కువగా ఉందని, తాగునీరు కూడా సక్రమంగా అందడం లేదని మంత్రి దృష్టికి తీసుకురాగా సమస్యను పరిష్కరించాలని ఆయన ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుకు సూచించారు. కేంద్ర ప్రభుత్వం నుంచి మంజూరైన జలజీవన్ పథకం నిధులను గత ప్రభుత్వం దారి మళ్లించిందని, దీంతో పలు గ్రామాల్లో మంచినీటి పైపులైన్లు వేసారే తప్ప ట్యాంకులు నిర్మించలేదని మంత్రి విమర్శించారు. ఈ సందర్భంగా మల్లేశ్వరం ఎంపీటీసీ కోటిపల్లి దేవికారాణి తదితర ఎంపీటీసీలు తమకు ఆగస్టు 15న పాఠశాలల్లో జెండాలను ఆవిష్కరించే అవకాశం కల్పించాలని, తమ గౌరవ వేతనం రూ.10 వేలకు పెంచాలని మంత్రికి వినతిపత్రం అందజేశారు. సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్ మాట్లాడుతూ పెరవలి మండలం వ్యవసాయపరంగా, పారిశ్రామికంగా ఎంతో ప్రాముఖ్యత కలిగి ఉందన్నారు. సమావేశంలో ఎంపీడీవో హిమమహేశ్వరి, తహశీల్దార్ డి.సుధ, జడ్పీటీసీ కొమ్మిశెట్టి రామాంజని, ప్రత్యేకాధికారి ఎం.సునీల్, ఆర్‌డబ్ల్యూ ఎస్‌ఈ ఎం.శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి తూర్పున 7,500 కోట్ల వ్యాపారం

బ్యాంక్ బరోడా ఏజీఎం రవీంద్రనాథ్ ఠాగూర్



రాజమహేంద్రవరం సిటీ, జూలై 20: ఒక చిన్ని కుగ్రామంలో ప్రారంభమైన బ్యాంక్ ఆఫ్ బరోడా ఈ రోజు దేశంలో 28 రాష్ట్రాలతో పాటు 25 దేశాల్లో సేవలందిస్తోందని బ్యాంక్ రాజమండ్రి ప్రాంతీయ కార్యాలయం అధికారి, అసి స్టెంట్ జనరల్ మేనేజరు ఎస్.రవీంద్రనాథ్ ఠాగూర్ తెలిపారు. రాజమహేంద్రవరం ఇన్నీసుపేటలోని ప్రాంతీయ కార్యాలయంలో శనివారం నిర్వహించిన బ్యాంక్ ఆఫ్ బరోడా 117వ ఆవిర్భావ దినోత్సవంలో ఆయన మాట్లాడారు. 1908 జూలై 20న బరోడా మహారాజు శ్రీసయాజీరావు గైక్వాడ్ -3 మొదటి బ్రాంచ్‌ను స్థాపించారని చెప్పారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 50 శాఖలున్నాయని మొత్తం 7500 కోట్ల బిజినెస్ చేస్తున్నామని చెప్పారు. ముందుగా బ్యాంకు వ్యవస్థాపకుడు బరోడా మహారాజు శ్రీసయాజీరావు గైక్వాడ్ -3 చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు.

దివ్యాంగుల ఆశ్రమంలో దుప్పట్ల పంపిణీ



దుప్పట్లు పంపిణీ చేస్తున్న బరోడా బ్యాంకు అధికారులు

దేవర పల్లి, జూలై 20: దుద్దుకూరు బరోడా బ్యాంకు 171వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా మండలంలోని గొల్లగూడెం భారతీ దివ్యాంగుల ఆశ్రమంలో దుప్పట్లు, నిత్యావసరాలు పంపిణీ చేశారు. బ్యాంకు మేనేజర్ ఊబా నానిబాబు మాట్లాడుతూ బరోడా బ్యాంకు ద్వారా అన్ని రకాల రుణాలు అందజే యడంతో పాటు వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో బ్యాంకు అధికారులు రాజశేఖర్, వెంకటేష్, కార్తీక్ పాల్గొన్నారు.

ప్రత్యేక పారిశుధ్య చర్యలు చేపట్టాలి

ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు

కొవ్వూరు/చాగల్లు, జూలై 20: అకాల వర్షాలతో ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ప్రత్యేక శానిటేషన్ చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అధికారులను ఆదేశించారు. శనివారం కొవ్వూరులో వర్షపు నీటితో ఉన్న కోర్టు ప్రాంగణం, పట్టణ పోలీసుస్టేషన్, చాగల్లులో జూనియర్ బేసిక్ స్కూల్ ప్రాంతాలనుపరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కోర్టుకు నూతన భవనం, సబ్‌జైలు ఉన్న ప్రాంతంలో మోడల్ పోలీసుస్టేషన్, కాటన్ విగ్రహం వద్ద నూతనంగా సబ్‌జైలు నిర్మాణం చేపట్టేందుకు చర్యలు తీసుకుంటానన్నారు. కోర్టు ప్రాంగణంలో డ్రైనేజీ, ఇంటర్నల్ రోడ్ల నిర్మాణానికి కృషి చేస్తానన్నారు. వర్షానికి దెబ్బతిన్న రోడ్లు, కల్వర్టులకు ఎస్టిమేట్లు తయారు చేసి మరమ్మతులు చేపట్టాలని అధికారులను ఆదేశించామని ఎమ్మెల్యే చెప్పారు. చాగల్లులో జూనియర్ బేసిక్ స్కూల్ సమీపంలో సీసీ రోడ్డు, డ్రైన్ లేని వీధిలో పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులు.. మురుగు బయటకు వెళ్లకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, రోడ్డు, డ్రైన్ నిర్మించాలని ఎమ్మెల్యేను కోరారు. గత పాలకుల నిర్లక్ష్యం వల్ల సమస్యలు పేరుకుపోయాయని, రోడ్డు, డ్రైన్ నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే అన్నారు. పేములకాలువ వరదనీటి ప్రవాహాన్ని, నీటమునిగిన పంట పొలాలను స్థానిక నాయకులతో కలిసి ట్రాక్టర్‌పై పర్యటించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన వెంట కొవ్వూరులో ద్విసభ్య కమిటీ సభ్యులు జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, కంటమణి రామకృష్ణారావు, మద్దిపట్ల శివరామకృష్ణ, సూరపనేని చిన్ని, ఎంపీపీ కాకర్ల నారాయుడు, దాయన రామకృష్ణ, పిల్లలమర్రి మురళీకృష్ణ, నీరుకొండ సూర్యానారాయన, యాగంటి చలపతి ఉండగా చాగల్లులో టీడీపీ నాయకులు ఆళ్ల హరిబు, నాదెళ్ల శ్రీరామ్‌చౌదరి, కరుటూరి సతీష్, తాళ్లూరి హరిశ్చంద్రప్రసాద్, తాళ్లూరి శ్రీనివాసరావు, జనసేన నాయకులు ఇంటి వీరబాబు, మిరియాల సతీష్, సర్పంచ్ ఉన్నమట్ల మనశ్శాంతి, కార్యదర్శి ఎల్.రవికుమార్ తదితరులున్నారు.



కొవ్వూరులో కోర్టు ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి

పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

వర్షాలకు పంట నష్టపోయిన అన్నదాతలను ప్రభుత్వం ఆదుకోవాలని టీడీపీ నాయకుడు, రైతు కేవీకే రంగారావు డిమాండ్ చేశారు. అకాల వర్షాలకు నియోజకవర్గంలో వరి, కూరగాయలు, అరటి పంట పొలాలు ముంపుకు గురయ్యాయన్నారు. ముంపుకు గురైన పంటలను సర్వే చేయించి నష్టపోయిన రైతులను ఆదుకోవాలన్నారు. కొత్తగా వరి పంట వేసుకోవాడానికి ప్రభుత్వం ఉచితంగా విత్తనాలు అందించాలన్నారు. కాలువల్లో పూడికలు పూర్తి స్థాయిలో తీయించాలని, కాలువలపై ఆక్రమణలను తొలగించాలని కోరారు.

ప్రభుత్వం నష్టపరిహారం ఇవ్వకుంటే పురుగుల మందు తాగుతా!

సామాజిక మాధ్యమాల్లో రైతు వీడియో



సీతానగరం, జూలై 20: తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలం చినకొండేపూడి గ్రామానికి చెందిన రైతు ముంపుకు గురైన తన పొలంలో పురుగుల మందు డబ్బా చేతబట్టి ప్రభుత్వం తనకు నష్టపరిహారం ఇవ్వకుంటే పురుగుల మందు తాగుతానంటూ చేసిన వీడియో సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతోంది. ఐదెకరాల పొలం కౌలుకు తీసుకుని రూ.25 వేలు పెట్టుబడి పెట్టి వరినాట్లు వేయగా అధిక వర్షాలకు నీట మునగడంతో నష్టపోయానని తనను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నట్టు ఆ వీడియోలో ఉంది.

లక్ష్మీగణపతిని దర్శించిన తెలంగాణా హైకోర్టు జడ్జి

బిక్కవోలు, జూలై 20: బిక్కవోలులోని ప్రాచీన ఆలయాలను తెలంగాణా హైకోర్టు జడ్జి సాంబశివరావు నాయుడు శనివారం కుటుంబ సభ్యులతో కలసి దర్శించారు. ముందుగా లక్ష్మీగణపతిని దర్శించి ఆపై గోలింగేశ్వర, కుమారసుబ్రహ్మణ్యేశ్వరస్వామి వార్లను దర్శించి ప్రత్యేక పూజలు జరిపారు. ఆలయ ఈవో ఆకెళ్ల భాస్కర్ పూర్ణకుంభ స్వాగతం పలికి ఆలయ మర్యాదలతో సత్కరించారు.

ప్రశాంతంగా ఆర్యాపురం అర్బన్ బ్యాంకు ఎన్నికలు

- ఓటు హక్కును వినియోగించుకున్న 1625 మంది ఓటర్లు



ఓటర్ల క్యూ

దివాన్‌చెరువు, జూలై 20: ఆర్యాపురం అర్బన్ బాంకు ఎన్నికలు శనివారం దివాన్‌చెరువులో ప్రశాంతంగా జరిగాయి. రాజానగరం మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 2665 మంది ఓటు వేసేందుకు వీలుగా కోఆపరేటివ్ బ్యాంకులో రెండు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఎడతెరిపిలేకుండా కురిసిన వర్షాన్ని సైతం లెక్కచేయకుండా వివిధ గ్రామాల నుంచి ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు వచ్చి లైన్లలో బారులు తీరి నిలబడి ఓటు వేశారు. 49వ పోలింగ్ కేంద్రంలో 1350 మంది ఓటర్లుకు గాను 883 మంది, 50వ పోలింగ్ కేంద్రంలో 1315 మంది ఓటర్లకు 742 మంది ఓట్లు వేశారని సిబ్బంది తెలిపారు. ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, టీడీపీ నియోజకవర్గం ఇన్‌చార్జి బొడ్డు వెంకటరమణచౌదరి పోలింగ్ కేంద్రం వద్దకు వచ్చి ఎన్నికలు జరిగిన తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా కూటమి అభ్యర్థి నీలపాల సూర్యసత్యనారాయణ విజయం సాధిస్తారని ఎమ్మెల్యే బత్తుల ఆశాభావం వ్యక్తం చేశారు.



రాజమహేంద్రవరంలో ఓటరు స్లిప్ చూస్తున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు

కూటమి ప్యానల్ విజయం ఖాయం: ఎమ్మెల్యే ఆదిరెడ్డి

రాజమహేంద్రవరం సిటీ, జూలై 20: రాజమహేంద్రవరంలో ప్రతిష్టాత్మకంగా జరిగిన ది ఆర్యాపురం కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ ఎన్నికల్లో కూట మికి చెందిన చల్లా శంకర్రావు ప్యానల్ విజయం ఖాయమని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. ఎస్‌కేవీటి కళాశాల ప్రాంగణంలో శనివారం బ్యాంక్ ఎన్నికల పోలింగ్ సరళిని పరిశీలించి మాట్లాడారు. ఓటర్లు చాలా ఓపికగా వర్షంలో క్యూలో నిలబడి ఓట్లు వేశారన్నారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల మాదిరిగా ఓటరు చైతన్యవంతంగా వ్యవహరించాడన్నారు. ఆయన వెంట మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాశి నవీన్‌కుమార్, మరుకుర్తి రవియాదవ్ ఉన్నారు.



రాజమహేంద్రవరంలో పోలింగ్ కేంద్రం వద్ద ఎదురుపడిన ఆదిరెడ్డి అప్పారావు..జక్కంపూడి రాజా

సినిమా గైడ్

కొవ్వూరు	
యువరాజ్‌మాల్ వై.స్క్రీన్1	కల్కి
వై.స్క్రీన్2	భారతీయుడు-2
దేవిశ్రీ(గాయత్రి)	ప్రభుత్వ జూనియర్ కళాశాల
అనన్య	భారతీయుడు-2
నిడదవోలు	
వీ మ్యాక్స్	డార్లింగ్
రాధాకృష్ణ	కల్కి
శ్రీగణపతి	భారతీయుడు-2
దేవరపల్లి	
శ్రీరామ్ సినీ మ్యాక్స్	కల్కి
శ్రీరామ్ సినీ మ్యాక్స్	కల్కి
నల్లజర్ల	
శ్రీలక్ష్మి మల్టీప్లెక్స్ స్క్రీన్1	భారతీయుడు-2
స్క్రీన్ 2	కల్కి
శ్రీనివాస	---